UNIVERSAL LIBRARY
OU_204225
UNIVERSAL LIBRARY

# ANANDA THIRD READER.

TELUGU

# ఆనందవాచకపుస్తకము

మూఁడవ తరగతి.

BY

KUCHI NARASIMHAM, B.A.,

AND

PANUGANTY LAKSHMI NARASIMHA RAO.

**Approved by the Director of Public Instruction, Madras.**

1930.

**R. VENKATESHWAR & Co.,**

LOANE SQUARE, MADRAS.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కో

లోన్ స్క్వేర్ మద్రాస్.

*All Rights Reserved.*

Price 3 Annas.] [వెల 3 అణాలు.

# పీఠిక

క్రింది తరగతుల యానందవాచక పుస్తకములు కఠినములుగా నున్న వని కొందఱు విద్యాశాఖాధికారు లభిప్రాయ పడుచున్నారు. కావున వలయుచోట్ల దిద్ది వాని సులభముగా వ్రాయుఁడని యానందముద్రాలయమువారు మమ్ముఁ గోరినారు. ఇద్దఱుముగ్గురు సబ్బసిస్టెంటిన్స్పెక్టరు గార్ల యభిప్రాయములు కూడ మా కంపినారు.

వారు గోరిన సవరణలలో మాకు సమ్మతములైనవానిని వందనపూర్వకముగాఁ జేసితిమి. విసంధులఁగూర్చి మేము వారితో నేకీభవింపఁజాలకున్నాము. శబ్దముయొక్క నిజరూపము పిల్లలయెదుటఁ బెట్టవలయునని వారి యభిప్రాయము. అది మంచిదే కాని, నియమరహితముగా విసంధులు చేసినయెడల, బాలుర కస్వాభావికోచ్చారణ మలవడుటయే కాక భాషా మాధుర్యమునకు భంగము కలుగును. చదువునప్పుడు పిల్లల గొంతుకలు నొప్పిపెట్టి, పాఠము క్లేశకర మగును.

కనుక మేమిప్పుడు రెండవవాచక పుస్తకములోఁ జేసిన పెక్కు విసంధులు విద్యాశాఖాధికారుల యెడల మాగౌరవమును జూపుటకుఁ జేయఁబడినవి కాని మనఃపూర్వకముగాఁ జేయఁబడినవి కావు. పైతరగతుల పుస్తకములలోఁ గ్రమముగా నట్టి యనిష్ట విసంధులు తగ్గించినాము.

ఛందోభంగాదిభీతిచేఁ బద్యములలో విసంధులు చేయుటకు వలనుపడినదికాదు. ఉపాధ్యాయులకొఱకు నుద్దేశింపఁబడిన ప్రశ్నలందును వ్యాకరణ భాగములలోను విసంధులు చేయలేదు.

వెనుకటి పీఠికలోఁ, గ్రింది వాచకపుస్తకములందలి పద్యములన్నియు స్వవిరచితములని వ్రాసితిమి. పై యుద్యోగుల యభిప్రాయము ననుసరించి యిప్పు డితర కవికృతములైన కొన్ని నీతిపద్యములు వానికిఁ జేర్చితిమి.

పీఠాపురము,
2-2-1920.

కూచి నరసింహము,
పానుగంటి లక్ష్మీనరసింహారావు.

# ఉపోద్ఘాతము.

రెండవతరగతి మొదలుకొని ఎనిమిదవతరగతివఱకు, అనఁగా మూఁడవ ఫారము చివరవఱకుఁ జదువుకొను బాలురకుపయుక్తమగునట్లు వాచకపుస్తకములను వ్రాయ నెంచితిమి. బాలురవయస్సును సమర్థతను మనసునందుంచుకొని, యేవిషయములఁగూర్చి చెప్పినయెడల వారు బాగుగ గ్రహించుకొనఁగలరో యట్టివిషయములఁ గూర్చియే వ్రాసెదము. ఆవిషయములైనను బాలురు నేర్చుకొనుట కుత్సాహపడునట్టివియే యేర్చి వ్రాసెదము. విసుగు పుట్టకుండునట్లు వేఱువేఱు విషయముల బోధించెదము.

అదిగాక, బాలుర వయస్సు, బుద్ధి, యెట్లు క్రమక్రమముగ వృద్ధినొందునో పాఠములలోనికష్టము, విషయములలోనికష్టము,నట్లు వృద్ధినొందునట్లు సాధ్యమైనంతవఱకుఁ జూచి వ్రాసెదము. మే ముపయోగించుభాష సులభముగనే యుండును; కాని యదిగూడఁ బైతరగతులకుఁ బోయినకొలఁది బాలుర వయస్సమర్థతల కనుకూలించునట్లు రవంత ప్రౌఢము కాకమానదు. అంతే కాని యతిదీర్ఘములగుసమాసములనుగాని వాడుకలోలేనిగ్రాంథికశబ్దములను గాని యుపయోగించి భాషను దుర్గ్రాహముగఁ జేయము. మఱియు వాడుకలో నున్నపదములుకదాయనియెంచి వ్యాకరణదుష్టరూపములను బ్రయోగింపము.

మొక్కలను గూర్చికాని జంతువులఁ గూర్చికాని వ్రాయునప్పుడైనను, వృక్షజంతుశాస్త్రములలోనిదుర్గ్రాహాంశము లందుఁ జేరనీయక, తెలుపఁదగిన ముఖ్యాంశములను వదలక, సామాన్యపాఠములవలెనే యవిగూడ సుబోధములగునట్లు వ్రాసెదము. శాస్త్రవిషయక పాఠములను జదువుకొనునప్పుడైనను వానిలోని విషయములను గ్రహించుకొను నొత్తుడుబాలురచిత్తములకుఁ దగులకుండునట్లుగాఁ బాఠరచనాపద్ధతి చిత్తరంజకముగా నుండునట్లు చేయఁ బ్రయత్నింతుము.

అడుగుతరగతుల వాచకపుస్తకములలో, విసంధులను గొన్నికొన్నిపట్లఁ జెరుగన్న యాధునికవచనగ్రంథకర్తలు వాడియున్నారు. అట్లొనర్చుట మంచిదనియే మాయభిప్రాయము. అయినను దానిని మే మొక్కనియమము ననుసరించి జాగరూకతతో వాడెదము. శబ్దముల కర్థము స్పష్టము గాదని తోఁచినచోట్లఁగాని, విపరీతార్థము లగునని తోఁచినచోట్లఁగాని, విసంధుల నుపయోగించెదము. శ్రవణకటుత్వము కలుగునని తోఁచిన కొన్నిచోట్లఁ గూడ వాని నుపయోగించెదము.

వాచకపుస్తకములనడుమఁగాని తుదనుగాని కొన్నిపద్యములఁ జేర్చెదము. అడుగుతరగతులపుస్తకములలోని పెక్కుపద్యములు స్వకల్పితములు. అవితఱుచు మంజరీలక్షణ సమన్వితములై యుండును. దసరాపాటలవలెనింపుగ బాలురు పాడుకొనుట కర్హములై యుండును గావున, మంజరీలక్షణమును బద్యరచన యం దుపయోగపఱచెదము. పైతరగతుల వాచకపుస్తకములలోనిపద్యములు కొన్ని స్వకల్పితములును, కొన్ని పూర్వకవిరచితములును నై యుండును. పూర్వకవిగ్రంథములలో నేయే పద్యములు రసవంతములై నీతిబోధకములై యుండునో యాపద్యముల నేయేర్చి వాచకపుస్తకములందుఁ గూర్చెదము. వానితోఁ గథాసందర్భములఁ దెల్పు కొన్నివాక్యములును సంక్షేపముగ వ్రాసెదము.

వ్యాకరణములోని సులభాంశములఁ గొన్నిటిని వాచకపుస్తకములతుదను జేర్చెదము. వీని నాయాతరగతులయుపాధ్యాయులు చూచి బాలురకు బోధించుట మంచిదని మాయభిప్రాయము. అడుగుతరగతులవాచకపుస్తకములలో వ్యాకరణ పరిభాషాపదములకు సాధ్యమైనంతవఱకుఁ జోటీయము; కాని, పైతరగతి పుస్తకములలోమాత్రము వాని ప్రయోగము లావశ్యకము లైనప్పుడవి యుపయోగించెదము. అయినను సులభములగు మాటలతో నాయాపదముల కర్థము లాతావులందే వ్రాసెదము. వ్యాకరణసూత్రములను గేవలసూత్రరూపముగ బోధించుటకంటె నీదిగువను జెప్పినవిధముగ బోధించుట యుక్తమని మాయభిప్రాయము. ఏసూత్రము నుపాధ్యాయుఁడు బాలురకు బోధింపనెంచునో యాసూత్రము క్రిందరాఁదగిన యుదాహరణములను సాధ్యమైనంతవఱకు వాచకపుస్తకములలోనివే యేఱి బాలురయెదుటఁ బెట్టవలయును. అన్ని యుదాహరణరూపములందుఁగూడ సమానముగఁ గలిగిన మార్పెదో సమానలక్షణమేదో బాలురు తమంతఁదాము పరిశీలించి గ్రహించుకొనునట్లు పాధ్యాయుఁడు చేయవలయును. ఆసామాన్యపుమార్పెదో యదియెప్పుడు కలుగునో బాలురనోటనే సాధ్యమైనంతవఱకుఁ జెప్పింపవలయును. అదియే, కాలోచితమగు చిన్న వ్యాకరణసూత్రమగును. వ్యాకరణాంశములనీరీతిగ బోధించుట యుత్తమము. బోధననిపుణులగు నుపాధ్యాయుల కట్లు చేయుట కష్టము కాదు.

విశేషానుభవము గలిగిన యుపాధ్యాయులు గాని తదితరులు గాని మావాచకపుస్తకములలో నేవైనలోపములున్నయెడల దయాపూర్వకముగఁ గనఁబఱచినచో, వానిని కృతజ్ఞతాభివందనములతో గ్రహించి తరువాతి కూర్పులో సవరించుకొనెదము.

# విషయసూచిక.

## మూఁడవవాచక పుస్తకము.


1. గేదె—The Buffalo ... ... ... 9
2. సిరా—Ink... ... ... ... 11
3. హాతింతాయి—Hathimthai—from Sadi's Gulistan. 12
4 తూనికలు, కొలతలు—Weights and Measures ... 14
5. కోఁతి—The Monkey ... ... ... 16
6. ఇద్దఱుఫకీరులు—Two fakirs—from Sadi's Gulistan 18
7. వ్యవసాయపు పనిముట్లు—Agricultural Implements... 20
8. అరఁటిచెట్టు, మొదటిభాగము—The Plantain Tree, part I. 22
9. అరఁటిచెట్టు, రెండవభాగము— Do. Do. Part II. 24
10. పట్టనము—The Town ... ... .. 26
11. మహమ్మదు, వైద్యుఁడు—Mahomed & the Physician from Sadi's Gulistan ... ... 28
12. గడియారము—The Clock ... ... 30
13. నక్క, గుంటనక్క—The Jackal and the Fox ... 33
14. శిబిచక్రవర్తి—Emperor Shibi ... ... 36
15. కమ్మరి—The Blacksmith ... ... 39
16. దూదిదొంగలు—Cotton Stealers—from Sadi's Gulistan 41
17. గద్ద—The Kite ... ... ... 43
18. పొడుగు, వెడల్పు, ఎత్తు, విరివి—Length, Breadth, Height and Area ... ... ... 45
19. పగలు, రాత్రి—Day and Night ... ... 48


| | | |
|---|---|---|
| 20 | భారతకథా సంగ్రహము—An Epitome of the Story of the Bharatham ... ... ... | 51 |
| 21. | పులి—The Tiger ... ... ... | 54 |
| 22. | సూర్యుడు, భూమి, చంద్రుడు—The Sun, the Moon and the Earth ... ... | 56 |
| 23. | పరమశాంతుడు—A Patient Man—from Chambers's Moral Class Book ... ... ... | 58 |
| 24. | చెన్నరాష్ట్రములోని ప్రజలు—The People of the Madras Presidency ... ... ... | 60 |
| 25. | తండ్రి కూతులు—The Father and his Daughters—from Æsop's Fables... ... ... | 62 |
| 26 | సర్. టి. ముత్తుస్వామి అయ్యరు—Sir T. Muthuswamy Aiyar ... ... ... ... | 64 |
| 27. | ఆరోగ్యసాధనములు—Means of Keeping Health ... | 66 |
| 28. | పరీక్షిన్నరేంద్రుడు—King Parikshith ... ... | 68 |
| 29. | శ్రీ జార్జిచక్రవర్తిగారి చరిత్ర — A Sketch of King George V. ... ... ... | 71 |


## PART II.


| | | |
|---|---|---|
| 1. | సూర్యోదయము—The Sunrise ... ... | 73 |
| 2. | తల్లి—The Mother ... ... ... | 74 |
| 3. | ఉక్క, వర్షము—Closeness and Rain ... | 76 |
| 4 | కట్టుకథ—A Riddle ... ... ... | 77 |
| 5. | దొంగ, అతని తల్లి—The Thief & his Mother ... | 78 |
| 6. | నీతిపద్యములు. ... ... ... | 80 |


## PART III.


| | |
|---|---|
| వ్యాకరణము—Grammar ... ... ... | 83 |



మొ ద టి భా గ ము.

# 1. గేదె.

నీవు పైపటములో చూచు జంతువును గేదె అనియు బఱ్ఱె అనియు చెప్పుదురు. ఆవు, గొఱ్ఱె, గేదె, ఇవి ఒక జాతిలో చేరినజంతువులు.

అవి అన్నియు ఆహారమును మొదట నమలకుండ మ్రింగును. తరువాత మేఁతమాని ముందు మ్రింగిన ఆహారమును కొంచెము కొంచెము మఱలనోటిలోనికి తెచ్చుకొని చక్కఁగా నమలును. దీనికే నెమరు వేయుట అనిపేరు.

ఈ జంతువుల పండ్లు, ఇవి తిను ఆహారమునకు తగినట్లుండును. కుక్కవలెను, పిల్లివలెను, తమ ఆహారమును పట్టి పండ్లతో చీల్పవలసిన పనిలేదు. ఆహారమును చక్కఁగానమలవలసి యున్నది; కనుక, వీనికి దంతములు మనకువలెనే

ఉన్నవి. పిల్లికిని, కుక్కకును, మునికోఱలుండును. ఈ జంతు



వుల కుండవు, పై దౌడకు మునిపండ్లుండవు. దంతములు మాత్రముండును. క్రింది దౌడకు ముని పండ్లును దంతములును కూడ ఉండును. ఇవి గడ్డి, ఆకులు మొదలగు వానిని క్రింది మునిపండ్లతో పై దౌడయొక్క ఇగురునకు నొక్కిపట్టి, త్రెంపును

కుక్కయు పిల్లియు తమ ఆహారమును నమలవు. కనుక, వాని క్రిందిదౌడ పైకి క్రిందికే కాని, ప్రక్కలకు కదలదు. ఆవుజాతిలోని జంతువుల క్రిందిదౌడ ప్రక్కలకు కూడ కదలును.

గేదె కొమ్ములు, ఆవు కొమ్ములవలె గుండ్రముగా ఉండవు. అవి పలకలు తేలి వెనుక వైపునకుఁ దిరిగి పొడుగుగాఉండును.


గేదెపాలలో బియ్యము పోసి కాఁచి పాయసము చేయుదురు. పాలను కాఁచి పంచదార కలిపి త్రాగుదురు. కాఁచిన యెడల పాలమీఁద మీఁగడ కట్టును. కాఁగిన పాలలో కొంచెము పుల్లనిచల్ల పోసి ఉంచినయెడల, గడ్డకట్టి పెరుఁగగును. మీఁగడయందు చేమురు కలదు. పెరుఁగు, కుండలో పోసి, కవ్వముతో చిలికినయెడల వెన్న వచ్చును ఆ వెన్నను కాఁచి నెయ్యిచేయుదురు. ఆవుపాలకంటె గేదెపాలు చిక్కనివి. కనుక, అవి యావుపాలంత శీఘ్రముగా జీర్ణముకావు

గేదెలకు దున్నలకు నీళ్లలోను బురదలోను దొర్లుట ఎంతో యిష్టము.

ప్రశ్నలు.—1 నెమరువేయుట యనఁగా నేమి? 2 నెమరువేయు జంతువుల మాఁటిని చెప్పుము 3 పిల్లిపండ్లకును కుక్కపండ్లకును భేదమేమి?

4. వీని క్రిందిదవడ యెట్లు కదలును? 5. కుక్కల క్రిందిదవడ యెట్లు కదలును?
6. వెన్న నెట్లు తీయుదురు?

మాటలు.—పాయసము, మీఁగడ, చిలుకుట, కవ్వము, శీఘ్రముగా, జీర్ణమగును.



## 2. సిరా.

చిరకాలమునుండి వ్రాఁతకు సిరా వాడుకొనుచున్నారు. అది సామాన్యముగా దొరకు వస్తువులతోనే చేయుదురు. పెక్కు రంగుల సిరాలు కలవు. సాధారణముగా మనము ఉపయోగించునది నల్లసిరా అగును.

కరకకాయలు కొట్టి, నీళ్లలో నానవేసి, కుతకుత ఉడుకఁబెట్టి, వడఁబోయుము. ఆ వడఁబోసిన నీళ్లలో అన్నభేదియు కొంచెము తుమ్మజిగురును కలిపి కొంచెము సేపట్లుంచుము. అప్పుడది నల్లసిరా అగును.

పై సిరాకు నీలిమందు కలిపినయెడల నీలిరంగు సిరా అగును.

వేఁడి నీళ్లలో ఎఱ్ఱరంగుపొడి కలిపిన యెడల, ఎఱ్ఱ సిరా అగును. ఎఱ్ఱసిరాతో ఉద్యోగస్థులు కొందఱు చేవ్రాలు చేయుదురు. అర్జీలమీఁద ఉత్తరువులు సంగ్రహముగా వ్రాయుదురు. ఎఱ్ఱసిరాతో గుఱుతులుకూడ పెట్టుదురు.

పూర్వకాలపు వారు దీపపు కాటుకతోను, తుమ్మ జిగురు తోను, నీళ్లతోను నల్లసిరా చేసెడువారు. కొందఱు దీపపు కాటుకకు బదులు మాఁడిచిన నూకలుగాని చోళ్లుగాని ఉపయోగించెడువారు.

అచ్చున కుపయోగించు సిరా మిక్కిలి చిక్కగా నుండును. దీపపు కాటుక కర్పూర తైలములోఁగాని, అవిసెనూనెలోఁగాని కలిపి అది తయారుచేయుదురు.

ప్రశ్నలు:— 1. నల్ల సిరా యెట్లు చేయుదురు? 2 ఎఱ్ఱసిరా యుపయోగములేవి? 3. అచ్చు సిరాకును వ్రాఁత సిరాకును భేదమేమి? 4. అచ్చు సిరా యెట్లు చేయుదురు?

మాటలు.— సామాన్యము, సాధారణము, కర్పూర తైలము, అన్నభేది, నీలిమందు, దీపపుకాటుక.

---

## 3. హాతింతాయి.

హాతింతాయి అను పేరుగల మహమ్మదీయుఁడొకఁడుండెను. అతఁడు గొప్పదాత. గొప్ప మనస్సు కలవాఁడు. "నీకంటె గొప్పవానిని ఎవ్వనినైన నీవు చూచితివా? పోనీ! అట్టి వాఁడెచ్చటనైన ఉండెనని వింటివా?" అని కొందఱు జనులతనిని అడిగిరి. "అట్టివానిని నా కన్నులతో నేను చూచితిని" అని అతఁడు బదులు చెప్పెను. "ఎచ్చటనో చెప్పెదవా" అని జను లడిగిరి. అతఁ డిట్లు చెప్పెను.

ఒకదినమున నే నొక గొప్పవిందు చేసితిని. ఆ విందున కందఱను పిలిచితిని. ఆ దినమున ఏదో యొక పనిమీఁద కొంతదూరము పోయితిని. అచ్చట నొక చిట్టడవిలో కట్టెలు కొట్టుకొనువాని నొకనిఁజూచితిని. అతఁడు చిన్నచిన్న కట్టెలను



పోగుచేసికొని మోపుకట్టుకొని, తలపై పెట్టుకొని, పట్టనములోనికి పోవుచుండెను. "ఓ పేదవాఁడా! ఏల యిట్లు కష్టపడెదవు? హాతింతాయి అనువాఁడు గొప్ప విందుచేయుచున్నాఁడు. నీవచ్చటకు పోయి సుఖముగా భుజింపరాదా?" అని ఆతనితో నే నంటిని. "పాటుపడి సంపాదించుకొనిన డబ్బుతో పొట్టపోసికొనవలయును గాని, హాతింతాయిగారి ఋణమున పడియుండ తగునా?" అని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ఆతఁడు నాకంటె గొప్పవాఁడు.

తేరగా వచ్చిన పిండివంటలు తినుటకంటె కష్టపడి గంజి త్రాగుట మంచిది.

ప్రశ్నలు.—1. హాతింతాయి యెట్టివాఁడు? 2. వానిని జనులేమియండిరి? 3. హాతింతాయికంటెఁ గట్టెలవాఁ డెట్లు గొప్పవాఁడు? 4. ఈ కథ వలన మీ రేమి నీతిని గ్రహించితిరి?

మాటలు.—దాత; విందు, ఋణము.

# 4. తూనికలు, కొలతలు.

రెండునఱ తులములకు మించనియెత్తుగల ఉత్తరము టపాలో వెళ్లుటకు అణాబిళ్ల అంటింపవలెను. తరువాత అదనముగా వచ్చు రెండునఱ తులముల భారమునకుఁ గాని అంతకు తక్కువ బరువునకుఁగాని ఒక్కొక్క అణాబిళ్ల అంటించుచుండవలెను. తుల మనఁగా ఒక రూపాయ యెత్తు.

బిళ్ల అంటింపకుండఁ గాని, తక్కువ బిళ్ల అంటించి కాని జాబులు పంపినయెడల న్యాయమైనసొమ్ముకంటె రెండు రెట్లు వసూలుచేయుదురు. రెండునఱతులములఉత్తరము ఊరకే టపాలోవేసినయెడలదానినిపుచ్చుకొనువారు రెండణాలీయవలెను. దానినే అఱణాబిళ్లతో పంపినయెడల, ఒకఅణా ఈయవలెను.

ఉత్తరములేకాక, కొన్నిరకముల సరకులుగూడ తూఁచెదరు. వంటచెఱకు, చింతపండు, బెల్లము, సొంటి, జాజికాయ; దాల్చినిచెక్క, కొన్నిమందులు,—ఇట్టి వానికి తూనికయే కాని; కొలత లేదు.


పుట్లు, మణుఁగులు, ఎత్తులు—ఇవి పెద్ద తూనికలు.

తులము, పలము, పంపు, ఏఁబలము, సేరు. పదలము, వీసె-ఇవి చిన్నతూనికలు.

చివర ఇచ్చిన తూనిక మానము 80-వ పేజీలో చూడుము.

కొన్నిసరకులు కొలిచి అమ్మెదురు. వడ్లు; గోదుమలు, పెసలు, మినుములు, కందులు, ఉలవలు మొదలగు ధాన్యములును, పాలు, పెరుఁగు మొదలగు కొన్ని ద్రవపదార్థములును కొలుచుట కుపయోగించునవి.

గిద్ద, అఱసోల, సోల, తవ్వ, మాన (మానిక), పడి, అడ్డ, కుంచేము—ఇవి చిన్నకొలతలు.



తూము, ఏఁదుము, పందుము, పుట్టి, గరిసె—ఇవి పెద్ద కొలతలు.

చివరఇచ్చిన కొలతమానమును 80-వ పేజీలో చూడుము.

దేశభేదమునుబట్టి అక్కడక్కడ కొలతలలో వార ఉండును.

తూనిక రాలును, కొలత గొట్టములును, సర్కారువారు సీసలు చేయించి ఇచ్చెదరు.

తప్పుతూనిక తూఁచి కాని, తప్పుకొలతకొలిచి కాని అమ్ము వర్తకులను పట్టుకొని, విమర్శించి, శిక్షింతురు.

ప్రశ్నలు.—1. 15 తులముల యుత్తరమును ఒకటినఱయణా బిళ్ల నంటించి పడవేసిన, నెంతసొమ్ము క్కువ యగునవలెను? 2. అదే బిళ్ల లేమియు లేకుండ బంపినయెడల నెంత యగునవలెను? 3. వీశె యెన్ని తులాలు యొత్తు? 4. ఎన్నిపలములు వీశె యగును? 5. గరిసెకు కుంచములెన్ని?

**మాటలు.**—అదనము, భారము, న్యాయ్యము, ఈఁబలము, **ఈఁదుము,** పందుము, ద్రవపదార్థములు, వార.



## 5. కోఁతి.

కోఁతి శరీరము రోమములతో కప్పఁబడియుండును. కాని, అది కొంతవఱకు మనుష్యుని పోలి యుండును. తలగుండ్రముగా ఉండును. చెవులు మన చెవులవలెనే ఉండును. మొగము దాదాపు మన మొగమువలెనే ఉండును. పాదమునకు అయిదేసి వ్రేళ్లుండును. బొటనవ్రేలు మనచేతి బొటనవ్రేలి వలెనే తక్కిన నాలుగువ్రేళ్లకు దూరముగా ఉండును. కోఁతి

మనవలెనె వెనుక కాళ్లమీఁదనిలువఁబడఁగలదు. కాని, అట్లుకొంచెము దూరము మాత్రమే అతి కష్టముతో నడువఁగలదు.

దాని బొటనవ్రేలు మనబొటనవ్రేలి వలెనే మిక్కిలి ఉపయోగకరము. చెట్లకొమ్మలు పట్టుకొనుటలో, ఆవ్రేలు దానికెంతో సహాయపడును. కోఁతి కొమ్మ పట్టుకొని, ఉయ్యాలలూఁగి, దుమికి, మఱియొక కొమ్మను పట్టుకొనును. ఇట్లొక చెట్టుమీఁదినుండి మఱియొక చెట్టుమీఁదికి పోఁగలదు.

కోఁతి సాధారణముగా చెట్లమీఁదనే ఉండును.

కోఁతులలో కొన్నిటికి తోఁక పొడుగుగాను మొగము నల్లగాను ఉండును. వానిని కొండముచ్చు లందురు.

కొన్నికోఁతులకు పిఱ్ఱలు ఎఱ్ఱగా ఉండును.

రెండు దౌడలలోను రెండుసంచు లుండును. వానిలో గింజలు,పండ్లు మొదలగు ఆహారపదార్థములను దాఁచుకొని, కావలసినప్పుడు నోటిలోనికి తెచ్చుకొని, నమలి మ్రింగును.

కోఁతిమొగము చూచినయెడల నవ్వు వచ్చును. ఒక నిమిషమందు అదివెక్కిరించును. ఇంకొక నిమిషమునందు కిచకిచ లాడును. బెదరినవానిమీఁదికి దుమికికఱచును. అది ఇండ్లపైకి ఎక్కి పెంకు లూడఁదీయును. అల్లరిపిల్లలు చేయు ఇట్టిచేష్టలకే కోఁతిచేష్టలని పేరు.

కోఁతిపిల్ల తన తల్లికడుపునంటి, గట్టిగా పట్టుకొని వదలక ఉండును. కోఁతి తనపిల్లతో కూడ ఒక చెట్టుమీఁది నుండి మఱియొక చెట్టుమీఁదికి దుముకఁగలదు.

బిచ్చగాండ్రు కోఁతులను పెంచి, ఊరూర తమతో తీసికొనివచ్చి బిచ్చమెత్తుకొందురు. ఆకోఁతులను చూచుటకుపిల్లలు

పరుగెత్తుకొని పోయి బిచ్చమధికముగా వెట్టుదురు. సర్కసులో కోఁతులచేత గుఱ్ఱములమీఁద సవారి చేయించెదరు.

ప్రశ్నలు.— 1. కోఁతులు సాధారణముగా నెక్కడ నుండును? 2. కొండముచ్చులని వేనికిఁ పేరు? 3. కోఁతిచేష్టలు కొన్ని చెప్పుము? 4. పిల్లి తనపిల్ల నెట్లు తీసికొనిపోవును? 5. కోఁతి యెట్లు తీసికొని పోవును? 6. కోఁతుల నెవరు పెంచెదరు?

మాటలు.—సహాయపడు, చేష్ట, సర్కసు.

---



## 6. ఇద్దఱు పకీరులు.

ఇద్దఱు పకీరు లోకయాత్రకు కలిసి పోవుచుండిరి. వారిలో ఒకఁడు మిగుల సన్ననివాఁడు. మూఁడేసిరోజులకు ఒకసారి స్వల్పముగ భుజించువాఁడు. రెండవవాఁడు లావుపాటివాఁడు. మిగులబలము కలవాఁడు. దినమునకు మూఁడుమాఱులు భుజించువాఁడు.

వీరిద్దఱు కలిసి యాత్రచేయుచు ఒకనాఁడొక పట్టనద్వారముకడకు వచ్చిరి.అక్కడ వీరిని ఎఱిఁగినవారెవ్వరును లేరు. ఆ గ్రామాధికారి వీరినిచూచి తమ రహస్యములను ఎఱుఁగుటకు శత్రువులు పంపినచారులై ఉందురని సందేహించెను ఎందులకైనమంచిదని వీరిని ఇద్దఱను పట్టుకొనియొక కొట్టులో ఉంచి దాని గుమ్మమును మట్టిగోడతో కప్పించెను.

పదునేను దినములయిన పిమ్మట వీరు తమశత్రువులుపంపిన చారులు కారనియు, నిజేమగు యాత్రికు లనియు గ్రామాధికారికి తగిన నిదర్శనములు తెలియవచ్చెను. దోషములేని వారిని శిక్షించితి నని గ్రామాధికారి చింతించి వారినిఖైదు నుండి విడుదల చేయుఁడని తన సేవకులకు ఆజ్ఞాపించెను.

అంత కొందఱుఖైదుకొట్టుదగ్గఱకువచ్చి గుమ్మమునకుఅడ్డముగాకట్టిన గోడను పగులఁగొట్టి చూచిరి. సన్నని వాఁడొక మూలను జపమాలను త్రిప్పుకొనుచు కూరుచుండెను లావుపాటివాఁడు చచ్చి పడియుండెను. బలము లేనివాఁడు బ్రదికియుండుట,సత్తువగలవాఁడుచచ్చుటచూచి జనులాశ్చర్యపడిరి.

అపుడొక బుద్ధిమంతుఁ డిట్లు చెప్పెను. "ఇట్లు జరుగుట ఆశ్చర్యము కాదు. లావుపాటివాఁడు విశేషముగా తిను అలవాటుకలవాఁడు అందుచే ఉపవాసమువలనికష్టమును సహింపలేక బెంగపడి మరణించెను. సన్ననివాఁడు మిక్కిలి తక్కువ తినువాఁడు. ఉపవాసముల సహింప అలవాటు పడినవాఁడు. అందుచే లంఘనములను లక్ష్యపెట్టక బ్రదికినాఁడు

మితముగాతినుట యలవాటైనవానికి తఱచుగా రోగములు రావు, వచ్చినను సులభముగ తేలిపోవును. సంపదలో మిగుల సుఖపడనేర్చిన మనుజుఁడు లేమిలో కష్టములను ఓర్చు

కొనలేక చచ్చెను. కావున, మనుజు లెల్లప్పుడు శ్రమపడుటకు అలవాటుపడి ఉండుటయే మంచిది.

ప్రశ్నలు.—1. ఫకీరు లిద్దఱు ఖైదున నెందుల కుంపఁబడిరి? 2 లావుపాటివాఁ డేల మరణించెను? 3 ఈ కథవలన గ్రహింపఁదగిన నీతియేమి?

మాటలు—పకీరు, యాత్ర, గ్రామాధికారి, శత్రువులు, చారులు, జపమాల, ఉపవాసము, లంఘనము.

---



# 7. వ్యవసాయపు పనిముట్లు.


వ్యవసాయమునకు పలువిధము లగు పనిముట్లు కావలెను. అక్కడక్కడ పెరిగిన తుప్పలను డొంకలను నఱికి వేయవలెను. అందులకు ముండ్లు గ్రుచ్చుకొనకుండ పొడుగైన పిడిగల కత్తి కావలయును. దీనిని పోటకత్తి యందురు.



నఱికిన డొంకను లాగుటకు ఒక డొంకెన కావలెను. ఇదిగో పొడుగైన కఱ్ఱ తుదను వంకరగా, ఇనుపకడ్డీ ఒకటి తాపఁబడి యున్నది.




ఇది గునపము. దీనినే గడ్డపాఱ అందురు. పుట్టలు త్రవ్వివేయుటకును భూమి పెల్ల విఱుచుటకును దీనిని ఉపయోగింతురు.





పాఱతో గట్లు వేయుదురు. బోదెలు కట్టుదురు. నూతులు త్రవ్వుదురు.

ఇదిగో నేలను దున్నుటకు నాఁగలి. దీనిలో ఒకటి అంకెగలభాగమును నాఁగటిదుంప అందురు. ఇది యీప్రదేశములందు తుమ్మకఱ్ఱతో చేయుదురు. దీని కొననున్న రెండంకెగలది కఱుగోల. ఇది ఇనుముతో చేయుదురు.





నేలను దున్నునప్పు డిదిభూమిలోనికి చొచ్చి నేలను పెకల్చును. పటమునందలి మూఁ డంకెగల భాగమునకు "ఏఁడికోల" అని పేరు. చూడు! ఏఁడికోలకు ఒక కాఁడి, మోకుతో కట్టఁబడి యున్నది. దీనికి దున్నపోతులను కాని యెద్దులను కాని కట్టి నేలను దున్నుదురు. దున్నునప్పుడు కఱుగోల నేలకు నొక్కి పట్టవలెను కనుక, నాఁగటివెనుకను ఏఁడికోలకు ఒకకఱ్ఱబిగించినారు. నాలు గంకెగల భాగము చూడుము. దీనిని మేఁడి యందురు. మేఁడికి మీఁది భాగమున చేతితో పట్టుకొనుటకు ఒక తోఁక


వంటిది యున్నది. దీనిని మేడితోక అందురు. మేడితోకను ఒక చేతితో నొక్కి పట్టుకొని రెండవ చేతిలోని కఱ్ఱతో ఎద్దులను తోలుదురు.

ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధపఱచిన నాఁగటిని "ఏరు" అనియు "అరక" అనియు అందురు.


మళ్లలోనికి నీరుపెట్టి దున్నుటకు ఉపయోగించు నాఁగళ్లు తేలికగా ఉండవలెను. వానికి దంపనాఁగళ్లని పేరు. నీరుపెట్టక దున్నుట కుపయోగించు నాఁగళ్లు బరువుగా ఉండును. వానిని మెట్టనాఁగ ళ్లందురు.



దమ్ముచేసిన మళ్లను చేదును చేయుటకు "చేదునుపట్టెను" ఉపయోగింతురు.



ఇవిగాక త్రవ్వుకోల కొడవలి మొదలగు పనిముట్లు కావలెను.



త్రవ్వుకోల.

ప్రశ్నలు.—1. నాఁగటి యొక్క భాగములెవ్వి? 2. కఱుగోల యుపయోగ మేమి? 3. మెట్టనాఁగటికిని దంపనాఁగటికిని భేద మేమి? 4. చేదునుపట్టె నెప్పుడు తోలుదురు? ఎందుకు?

మాటలు:—నఱుకుట, పుట్ట, కడ్డి, పెల్లవిఱుచుట, బోదె, దమ్ముచేయుట.

## 8. అరఁటిచెట్టు.

### మొదటి భాగము.

నీవు చూచుచున్న చెట్టు అరఁటిచెట్టు. మొదట ఉన్న చిన్న మొక్కలు దాని పిల్లలు. ఆ పిల్లలు, భూమిలో ఉన్న దుంప నుండి పుట్టినవి. దుంపనుండి భూమిలోనికి వేళ్లు పాఱును.

భూమిలోనుండి చెట్టు తిన్నగా పైకి పెరుఁగును. దుంప మొదలుకొని పై ఆకులవఱకు ఉన్న భాగమునకు కాండ మనిపేరు. దానినే బొంద అందురు. అరఁటి చెట్టునకు కొమ్మ లుండవు.

అది సాధారణముగా పది పదునేను అడుగుల పొడుగు పెరుఁగును.

ఆ బొందను దొప్పలు దొప్పలుగా నూడఁదీయ వచ్చును. గెల వేసిన చెట్టైనయెడల దొప్ప లూడఁదీయఁగా తీయఁగా, బొంద పొడుగునను తెల్లని కఱ్ఱవంటి పదార్థముండును. దానికి దూఁట యనియు, దవ్వ యనియు, ఊఁచే యనియు పేళ్లు.

అరఁటిచెట్టు పిల్లగా ఉన్నప్పుడు చిన్న చిన్న ఆకులు వేయును క్రమముగా పెద్దాకులు వేయును. బాగుగా పెరిఁగిన అరఁటాకు రెం డడుగుల వెడల్పును, ఆఱు మొద లెనిమిదడుగుల పొడుగును ఉండును. ఆకులు నాల్గు దిక్కులకును వ్యాపించి ఉండును. అవి గాలికి అల్లల్లాడి చెట్టును కదల్చివేయును. పెద్ద గాలికి చెట్లు విఱిగిపోకుండ ఆయాకు లక్కడక్కడ చినిఁగి పోవును. అప్పుడు చీలికల నడుమనుండి గాలి పోవును గనుక. ఆకు లంతగా కదలవు. అందుచేత చెట్టునకు హాని కలుగదు.

వేళ్లు భూమిలోని ఆహారమును నీటితో పీల్చుకొనును. గాలికి పడిపోకుండ చెట్టును నిలఁబెట్టును. ఆకు లేమి చేయును? వేళ్లనుండి వచ్చిన ఆహారమును ఆఁపి నీటిని మాత్రము గాలి లోనికి వదలును. మఱికొంత ఆహారమును గాలిలోనుండి తీసికొని లోనికి పీల్చుకొనును. కనుక ఆకులు కోసి వేయఁ గూడదు. గొంగళి పురుగులు పట్టి ఆకులను దినివేయ

వచ్చును. కనుక, ఆ పురుగులు చిన్నవిగానుండి ఏదో ఒక తూకు నంటియున్నప్పుడే ఆ యాకును కోసి దూరముగా పాఱ వేయవలెను. లేనియెడల చిన్నపురుగులు పెద్దవై ఆ చెట్ల యాకు లన్నిటిమీఁదికి మాత్రమే కాక తోఁటలోనున్న చెట్లన్నిటిమీఁదికి ప్రాఁకి ఆకులను తినివేయును. ఆకులు లేని చెట్టు పెరుఁగదు.

ప్రశ్నలు.—1. చెట్టుయొక్క ముఖ్యభాగము లెవ్వి? 2. వేళ్లేమి చేయును? 3. ఆకు లేమి చేయును? 4. అరఁటిబొంద యని దేనికిఁ పేరు? 5. అదెట్లుండును? 6. ఆకులను గోసి వేసినయెడల నష్ట మేమున్నది?

మాటలు:—కాండము, వ్యాపించుట, హాని.

---

# 9. అరఁటిచెట్టు.

## రెండవ భాగము.

అరఁటి చెట్టునకు వేళ్లు, కాండము, ఆకులును ముఖ్య భాగము లని నీవు నేర్చుకొని ఉన్నావుగదా! అన్ని చెట్లకును ముఖ్యభాగము లివియే యని తెలిసికొనుము.

రెం డడుగుల లోఁతుగల గొయ్యితీసి, దుంపను గోతిలో ఉంచి, మట్టిపోసి, నీరు పోయుచుండినయెడల సాధారణముగా అరఁటిచెట్టు ఎనిమిది, పదినెలలలో గెలవేయును. ఆగెల నాలుగు నెలలకు పండును. కనుక అరఁటిచెట్టు సుమా రొకసంవత్సరము బ్రతుకును. అరఁటిచెట్టు ఒక్కమాఱుమాత్రమే గెలవేయును.

పిలుక పెద్ద చెట్టయి, దుంపనుండి తిరుగ పిల్లలు పెట్టునుగాని అరఁటిగింజలు చల్లి మొక్కలు మొలిపింపరు.

గెలవేయుటకు ముందుగా అరఁటిచెట్లొక చిన్నాకువేయును.

దానిని "కోటాకు" అందురు. ఆయాకు రాఁగానే చెట్టు గెల వేయునని యనుకొనవలెను.

అరఁటి పువ్వు ఎఱ్ఱగానుండి బూడిద చేఱచేను. క్రమముగా పువ్వు విడిచి అత్తములు వేయును. అత్తము లనఁగా పూవు దొప్పల క్రిందనుండు కాయలవరుసలు.

బలముగా పెరిఁగిన యరఁటిగెలకు ఎనిమిది మొదలు పంద్రెండ త్తము లుండును. అత్తములో కాయలు రెండువరుసలును ఒక్కొక్కవరుసకే డెనిమిది కాయలునుఉండును. కనుక సాధారణముగా గెలకు నూఱు మొదలు రెండువందల కాయలుండును.

అరఁటులలో పెక్కు రకము లున్నవి. బొంత, చక్కెరకేళి, అమృతపాళి, వానిలోని కొన్ని రకములు.

అరఁటియాకులను విస్తళ్ళుగా వాడుదురు. దొప్పలతో విస్తళ్లు కుట్టుదురు. వానినుండి నారతీసి బట్టలు నేయుదురు. దూఁటను పువ్వును కాయలను, పచ్చడిగాను, కూరగాను చేసికొని తిందురు. పండ్లు మిక్కిలి రుచికలవి. కనుక వానిని విశేషముగా భుజించుచుందురు. దీపావళి, దసరా మొదలగు పండుగలందును పెండ్లి మొదలగు శుభకార్యము లందును గెలలతోకూడ అరఁటిచెట్లను నఱికి పందిటి స్తంభములకు కట్టుదురు. అప్పుడు పందిరి యెంతో శృంగారముగా ఉండును. అరఁటిచెట్టెంతో ఉపయోగకరమైనది.

ప్రశ్నలు.—1 చెట్టుయొక్క ముఖ్యభాగము లెవ్వి ? 2. పిల్లలెట్లు మొలచును? 3. సాధారణముగా అత్తమున కెన్ని కాయ లుండును ? 4. అరఁటి చెట్టులో నేయే భాగము లెట్లె ట్లుపయోగింతురు ?

మాటలు.—అత్తము, బూడిద, రకము, శుభకార్యము, శృంగారము, స్తంభము.

# 10. పట్టనము.

పల్లెలను గురించి రెండవవాచక పుస్తకములో చదివి యుంటిరి. వానికంటె పెద్దయూళ్లను పట్టనము లందురు.

పల్లెలకంటె పట్టనములలో భాగ్యవంతు లెక్కువగా ఉందురు. మేడలు, మిద్దెలు, పెంకుటిండ్లు విస్తారముగా ఉండును. తాటాకుకొంపలును పూరికొంపలును ఎక్కడనో కాని కానరావు. జనులు క్రిక్కిరిసి ఉందురు. పల్లెలలోవలెఁ గాక సమస్త భోజనపదార్థములును దొరకును. వర్తకులు విశేషముగా ఉందురు. క్రయవిక్రయములు నిత్యమును బజారులో జరుగుచుండును. ఎప్పుడేవస్తువు కావలసిన, అప్పుడావస్తువు లభించును. కొనుటకు డబ్బుమాత్రము ఉండవలెను.

జనులు చాలనాజూకుగా ఉందురు. శుభ్రమైనవియు, విలువ కలిగినవియునగు దుస్తులు వేసికొందురు. విద్యనేర్చినవారెక్కువగా ఉందురు. అట్టివారిని నాగరకు లందురు. నాగరకత పల్లెలకంటె పట్టనములలో ఎక్కువ. కాని, వానిలో మోసమును, తగవులును, అసూయయు హెచ్చుగా నుండును.



ప్రజారక్షణముకై ప్రభుత్వమువారు పట్టనములలో పోలీసు కచ్చేరీ లుంతురు. అనేక రక్షకభటులు—కానిస్టేబిల్సు ఉండి ప్రజలను దోపిడీగాండ్ర బాధనుండియు మోసగాండ్ర బాధనుండియు రక్షించుచుందురు.

దెబ్బలాట,దగా, దోపిడి-మొదలగు నేరములు విమర్శించి శిక్షించుటకై యొక న్యాయాధికారి-మేజిస్ట్రేటు-ఉండును.స్వల్ప కాలపు ఖైదు శిక్ష పడినవారినిడుంచుటకొక చిన్న జైలు ఉండును.

రోగులకు నిత్యము మందిచ్చుటకు ధర్మవైద్యశాలలు— హాస్పిటల్సు ఉండును. వానిలో బీదలకు ఊరకే వైద్యము చేయుదురు. కొందఱు రోజును వచ్చి మందులు తీసికొని వెళ్లుదురు. కొందఱు వైద్యశాలలోనేయుండి, ధర్మముగనే పథ్య పదార్థములు పుచ్చుకొనుచు చికిత్స చేయించుకొని జబ్బు నిమ్మళించిన తరువాత వారి వారి తావులకు పోదురు.



ఇతర స్థలముల నుండి వచ్చిన యుత్తరములును, సొమ్మును వస్తువులును ఆ పట్టనము వారి కిచ్చుటకును, ఆ పట్టనమువారు వ్రాయు ఉత్తరములు మొదలగునవి యితర స్థలములకు పంపుటకును టపాకచేరీ పోస్టాఫీసు ఒకటియుండును. నిత్యమును జాబులు మొదలగునవి ఊరివారికిచ్చుటకు టపాబంట్రోతులుందురు.

టపాకచేరితో చేరియే తంత్రీవార్త లంపుటకు తంత్రీశాలయొకటియుండును. దానిని-టెలిగ్రాఫాఫీసు-అందురు. తంత్రీ మూలమున స్వల్పవ్యయముతో, ఎంతదూరమున ఉన్నవారి

కై నను,స్వల్పకాలములో,వార్తలును సొమ్మును పంపవచ్చును.

బాలురకును, బాలికలకును విద్యనేర్పుటకు పెద్ద పాఠశాలలుండును. వానిలో నానావిషయములు, దేశభాషలతోను, ఇంగ్లీషుభాషతోను నేర్పుదురు. బుద్ధి అభివృద్ధిపఱుచుటయే కాక, వ్యాయామము చేయించి,శరీరబలమును ఆరోగ్యమును కూడ వృద్ధిపఱతురు.

కాళ్లు, కదపాలు, క్రయపత్రములు మొదలగుకాగితములు, ముందు తగాదాలు రాకుండ, రెజిస్టరు చేయుటకై, సబ్రెజిస్ట్రారు కచేరీ ఒకటి యుండును.

ప్రభుత్వమువారి పన్నులు సరిగా వసూలు చేయించుటకును, రెవిన్యూ వ్యవహారమును పరిష్కరించుటకును తహస్సిల్దారుకచేరీ ఉండును.

చరాస్తి, స్థిరాస్తులఁ గూర్చిన తగాదాలు, వారసులవివాదములు మొదలగు సివిల్వ్యవహారములు విచారించి తీర్పుచెప్పుటకు పెద్దపట్టనములలో-డిస్ట్రిక్టు మున్సిఫ్కోర్టులు ఉండును.

జిల్లా ముఖ్యపట్టనములలో జిల్లాకలెక్టరు కచేరీ, జిల్లాజడ్జి కచేరీ మొదలగు పెద్ద కచేరీలుకూడ ఉండును.

ఎన్నియున్నను, పల్లెలలోనున్న శాంతియు, నిర్మలమైన గాలియు, ఆరోగ్యమును తఱచుగా పట్టనములలో ఉండవు.

ప్రశ్నలు:—1. పల్లెల కంటెఁ బట్టనములలో నున్న సదుపాయము లేవి ? 2. పట్టనముల కంటెఁ బల్లెలలోనుండు సుఖ మెట్టిది? 3. పట్టనములలో సాధారణముగానుండు కచేరీలలో మూఁటిని జెప్పి వాని ప్రయోజనములఁ దెల్పుము ? 4. గొప్ప పట్టనములలో నుండు పెద్ద కచేరీ లేవి?

మాటలు.—క్రిక్కిఱిసియు, క్రయవిక్రయములు, నాగరకత, రతుకభటులు, వైదు, పథ్యపదార్థములు, చికిత్స, తంత్రీవార్త,

వ్యాయామము, రెవిన్యూవ్యవహారము, చరాస్తి, స్థిరాస్తి, సివిల్వ్యవహారము.

---

## 11. మహమ్మదు, వైద్యుఁడు.

ఒక రాజు, తన దేశములోనున్న యొక గొప్ప వైద్యుని, మతగురువగు మహమ్మదుగారియొద్దకు అరేబియా దేశమునకు పంపెను. ఆవైద్యుఁ డక్కడ ఒకసంవత్సర ముండెను. ఆతని యొద్ద ఒక్కఁడైనను మందు పుచ్చుకొనలేదు. జబ్బుగానున్న దని యాతనితో ఒక్కఁడైనను చెప్పలేదు. ఆతఁడు గురువు గారియొద్దకు పోయి యిట్లు చెప్పెను.

"అయ్యా! మీమిత్రులకు వైద్యముచేయుటకై నన్ను మా దేశపు రాజుగారు పంపినారు. నేనువచ్చి యొకసంవత్సరమైనది. ఇంతవఱకు ఏరోగియు నాయొద్దకు రాకపోవుటచేత మందిచ్చు టలో నా తెలివిని గనఁబఱచుటకు అవకాశము లేకపోయినది."

వైద్యుఁడుచెప్పిన యీ మాటలనువిని, మహమ్మదుగారిట్లు చెప్పిరి. "వైద్యుఁడా! ఆఁకలి బాగుగా అగునప్పుడే అన్నముతిన వలయుననియు, అప్పుడైనను కొంత యాఁకలి మిగిలియుండు నప్పుడే తినవలయుననియు, మాసంఘమున ఒక నియమమున్నది."

వైద్యుఁడీమాటలను విని అదియే ఆరోగ్యమునకు మొదటి హేతువనియు తానచ్చట ఇఁక ఉండవలసిన పనిలేదనియు చెప్పి సెలవుతీసికొని పోయెను.

ఇఁక మాటలాడక తప్పదనునప్పుడే బుద్ధిమంతుఁడు మాట లాడును. అట్టిమాటవలన మేలుగలుగును. ఇఁక తినకతప్పదను నప్పుడే బుద్ధిమంతుఁడు తినును. అట్టితిండి ఆరోగ్యమిచ్చును.

ప్రశ్నలు:—1. వైద్యుని అరేబియా దేశమున కేల రాజు పంపించెను?

2. తమసంఘమునన్న నియమ మేదని మహమ్మదు చెప్పెను? 3. వైద్యుఁడచ్చోటనుండక యేల వెళ్లిపోయెను?

మాటలు:—వైద్యము, అవకాశము, సంఘము, నియమము.

---

# 12. గడియారము.

## మాణిక్యము–సావిత్రి.

సా:—"పగలు మబ్బుపట్టినప్పుడును, రాత్రియును ప్రొద్దు తెలియదు; సూర్యుఁడున్నప్పుడైనను సిసలుగా తెలియదు; గడియారమును చూచి కాలమును తెలిసికొనుట చెప్పు" మంటివి. ఇప్పుడు చెప్పెదను. నేర్చుకొనెదవా?

మా:—మాణిక్యములాగు నేర్చుకొనెదను.

సా:—సరే, ఇదిగో! ఈ గడియారమువంక చూడు. దీని మీఁదనుఉన్న పంద్రెండంకెలు నీకు తెలియునా?

మా:—ఆ! అవి, నేను రెండవతరగతిలోనే, నేర్చుకొన్నాను.

సా:—చుట్టు నున్న మధ్యభాగము లెన్ని యున్నవి?

మా:—అంకె లెన్నో అన్ని-పంద్రెండు.

సా:—అంకెకును అంకెకును నడుమబొట్లున్నవి. చూచినావా?

మా:—చూచినాను. అంకెలమీఁదివానితోకలిసి అఱువది.

సా:—వానివల్లఁ గలిగిన చిన్నభాగము లెన్ని?

మా:—ఒక్కొక్కదానిలో అయిదు; పంద్రెండింటిలోను, పంద్రెండయిదులు-అఱువది.

సా:—అవియే, నిమిషభాగములు - అనఁగా నిమిషములను తెల్పు భాగములు.

సా:—ఒక పొడుగుముల్లును ఒక పొట్టిముల్లును ఉన్నవి. అవి కనఁబడు చున్నవా?


మా:—చిన్న బొట్లు కనఁబడఁగా, అవి కనఁబడవా?

సా:—గంటకు అఱువది నిమిషములు, అఱగంటకు ముప్పది. పావుగంటకు పదియేను.

మా:—అది నా కిదివఱకే వచ్చును.

సా:—పోనీ! గంటలోనున్న నిమిషములును, గడియారముపై నున్న చిన్నభాగములును, అఱువదియే యని చెప్పఁబోవుచుంటిని. ఇప్పుడు ముండ్లెక్కడ ఉన్నవి?

మా:—గడియారము మీఁద.




సా:—ఔనులే! ఏ అంకెమీఁద?

మా:—రెండును పంద్రెండవ అంకె మీఁద నున్నవి.

సా:—ఇపుడు పంద్రెండు గంట లైనది.

మా:—నీవు చెప్ప నక్కఱ లేదు, గడియారమే చెప్పినది. ఇప్పుడేకాదా అది ఖంగు ఖంగున పంద్రెండు కొట్టినది.

సా:—జాగ్రత్తతో చూడు. ముండ్లు త్రిప్పుచున్నాను. ఇప్పుడవి యెక్కడ నున్నవి?



మా:—పెద్దముల్లు మూఁడవయంకెమీఁద నున్నది, చిన్నది పంద్రెండు, ఒకటి-నడుమ నున్నది.

సా:—చిన్న ముల్లు గంటలు చూపును పెద్దది నిమిషములు చూపును. పెద్దముల్లు పంద్రెండంకెనుండి యెన్ని చిన్న భాగములు వచ్చినదో చెప్పు.

మా.—అయిదు, అయిదు, అయిదు - పదియేనునిమిషములు వచ్చినది. పంద్రెండుంబావు అయినది.

సా:—అంతకంటె సులభముగా లెక్కింపలేవా? పెద్ద ముల్లేయంకెమీఁద నున్న దంటివి?


మా:—సరే, తెలిసినది. మూఁడైదులు పదియేను.

సా:—మఱల త్రిప్పుచున్నాను. ఇప్పుడు ప్రొద్దెంతో సరిగా చెప్పు.


మా:—నీవు పెట్టిన ప్రొద్దా? నిజమైన ప్రొద్దా?

సా—పరిహాసమునకా పాఠమునకా వచ్చినది?

మా:—కోపపడకు - పెద్దముల్లు ఆఱంకె మీఁదను, చిన్నముల్లుపంట్రెండు, ఒకటి నడుమను, ఉన్నవి. కనుక, పంట్రెండు గంటల-ఆఱైదులు ముప్పది, ముప్పది నిమిషములు. పంట్రెండు నఱ.



సా:—ఇప్పుడు?



మా:—పెద్దముల్లు మఱల పంట్రెండంకె మీఁద నున్నది. చిన్నముల్లు సరిగా ఒకటంకె మీఁదికి వచ్చినది. కనుక - ఒంటిగంట అయినది. అదిగో! నిజేమని గంట కూడ కొట్టినది.


సా:—పంట్రెండంకె మీఁద నున్నప్పుడు, పంట్రెండైదులు అఱువదికాదా?

మా:—ఆమాత్రము తెలియక పోలేదు. పంట్రెండు గంటల తరువాత పంట్రెండైదులు-అనఁగా ఒంటిగంట.

సా:—నీవు చేయుకైన దానవు. చూచితివా చిన్నముల్లు అయిదు నిమిషభాగములు తిరుగు నప్పటికి పెద్దది అఱువది

భాగములు - పండ్రెండు రెట్లు వడిగా - తిరిగినది. ఇప్పుడు చెప్పరో! చూతము.

మా.—చిన్నముల్లు మూఁడు, నాలుగు నడుమ నున్నది. సరే, మూఁడుగంటల కెక్కువ, నాలుగుగంటలకు తక్కువ - అన్నమాట. పెద్దముల్లు తొమ్మిదకె దాఁటి రెండుచుక్కలు వచ్చినది-తొమ్మిదైదులు నలువది యైదు; నలువదియైదు, రెండు, నలువది యేడు-మూఁడుగంటల నలువదియేడు నిమిషములైనదమ్మా!



ప్రశ్నలు:—1. చిన్నముల్లెనిమిది తొమ్మిది నడుమను, పెద్దముల్లు అయిదంకకు రెండుచుక్కలు తరువాయిగాను ఉన్నప్పుడు ప్రొద్దెంత? 2. ఏడుగంటల ముప్పావైనప్పుడు ముండ్లెట్లుండునో గడియారము గీసి చూపు.

మాటలు:—మధ్య భాగములు, నిమిషభాగములు, చురుకైన దానవు, పరిహాసము.

## 13. నక్క, గుంటనక్క.


అప్పుడప్పుడు, చీఁకటి పడఁగానే, ఊరిబయట నక్కలు కూయుచుండుట వినియుందువు. ఆ కూఁత వినినప్పుడు నీవు, మిక్కిలి భయపడి యుందువు. అది పిల్లలకు మిక్కిలి భయంకరముగానే యుండును.

నక్కయు, కుక్కయు ఒక్కజాతిలోనివి.

పెద్దనక్కలు, గుంటనక్కలు, అని నక్కలలో రెండు జాతులున్నవి. పెద్దనక్కలనే సాధారణముగా నక్క లందురు.

నక్క లడవులలోను, బయళ్లయందును గూడ నుండును.

నక్క సాధారణముగా రెండు, రెండునఱ అడుగులు



పొడువుండును. దాని తోఁక కుచ్చుతోఁక యుండును. అది దాని పొడుగులో రమారమి మూఁడవ వంతుండును. ఆకుచ్చు వెండ్రుకల చివరలు నల్లగానుండును. దాని కంటిపాపలు కుక్కలకువలె గుండ్రముగా నుండును.

నక్కలు ఒంటరిగాఁ గాని, జతలుగాఁ గాని, గుంపులుగాఁ గాని కాన్పించును.

నక్కలు వేసవికాలమందు పగలు, వేఁడిమి భరింపలేక నీటిలో నుండునుగాని బొఱియలలో నుండవు.

అవి రాత్రులందు సంచరించుచు మేఁకపిల్లలను, గొఱ్ఱెపిల్లలను, కోళ్లను తినుచుండును. భూమిలో పాఁతిపెట్టిన శవములను పైకి ఎక్కలాగి తినును. మొక్కజొన్నచేలు, చెఱకుతోఁటలు, నక్కలుపాడుచేయుచుండు నని నీవు వినియుందువు.

రెండవజాతి నక్కలు గుంటనక్కలు. నేలలో బొఱియలు చేసికొని వానిలోనుండును గనుక వానికి ఆ పేరువచ్చియుండవచ్చును. నక్కకంటె గుంటనక్క చిన్నజంతువు. అది సాధారణముగా అడుగునఱ పొడుగు పైగా నుండును. దాని కుచ్చు

తోఁక ఒకయడుగు పొడుగునకు మించియుండును. ముట్టె యెక్కువ మొన దేఱియుండును. చెవులు పెద్దవి. కంటిపాపలు వెలుతురులో సన్నగిల్లి కొంచెము కోలగా నుండును. పెద్ద నక్కలకును కుక్కలకును వెలుతురులో చిన్నవైనను, అవి గుండ్రముగానే యుండును.

అది పగలు బొఱియలలోనో, చెట్లతోఁపులలోనో యుండును.

అది పసిపట్టఁగలదు. చిటుక్కుమని చప్పుడైన, దానికి తెలియును. తెలివి తేట లెక్కువ.

ఇంగ్లండు మొదలగు దేశములందలి గుంటనక్కల శరీరము లొకవిధమైన వాసనగొట్టును. అందుచేత వేఁటకుక్కలు పసిపట్టి వానిని పట్టుకొనఁ గలవు. మన దేశమందలి వాని కట్టి వాసన యుండదు. అందుచేతనే, మన దేశమందు గుంటనక్కలను దొరలు వేఁటాడరు.

గుంటనక్కంత టక్కరిజంతువు మఱియొకటి లేదు. తన్ను తఱుముకొనివచ్చిన వేఁటకుక్కలను మోసపుచ్చి తప్పించుకొనఁ గలదు. దానిని పట్టుకొన వచ్చిన వేఁటకాండ్ర పన్నుగడలకు మాఱు పన్నుగడలు పన్ని, వారిని మోసపుచ్చి పాఱిపోవును.

అది పీతలను, నత్తలను, బల్లులను, ఎలుకలను, చెదపురుగులను తినును.

**ప్రశ్నలు:**—1. గుంటనక్కకును, నక్కకును భేదమేమి? 2. నక్క లేమి తినును? 3. మన దేశమందు గుంటనక్కల నేల వేఁటాడరు? 4. గుంటనక్క యెట్టి జంతువు?

**మాటలు.**—భయంకరము, ఒంటరిగా, బొఱియ, శవము, పసిపట్టుట, టక్కరి, పన్నుగడ.



# 14. శిబిచక్రవర్తి.

ఈతఁడొక గొప్ప చక్రవర్తి. ఇతఁడు దాతృత్వమునకు మిక్కిలి ప్రసిద్ధిచెందెను. ఈతఁడొక గొప్ప యజ్ఞము చేసెను. అన్ని వర్ణముల వారికి మిక్కిలి విరివిగా అన్నప్రదానము చేసెను. ఉత్తములగు బ్రాహ్మణులకు బంగారము, గోవులు, వస్త్రములు, గృహములు, రత్నములు, భూములు మొదలగు పదార్థములను దానము చేసెను. ఆయజ్ఞము విఘ్నము లేకుండ మిక్కిలి బాగుగా పూర్తి యయ్యెను.

కడపటి దినమున గడగడ వడఁకుచు ఱెక్కలు రెపరెపలాడించుకొనుచు నోరు తెఱచుకొని యొక పావురము ఆచక్రవర్తి ఒడిలో తటాలున వ్రాలెను. ఆతఁడు దానిని దువ్వుచు బుజ్జగించుచుండఁగా ఇంతలో ఱివ్వుమని యొక డేగ యాతనిముందు వ్రాలెను. అది చక్రవర్తివంక చూచి మనుష్యులు మాటలాడు విధమున నిట్లనియెను.

"అయ్యా! మహారాజా ! నీవు సత్యవంతుఁడవనిధర్మాత్ముఁడ వని వినియుంటిని.ఆఁకటిచే నాకడుపు మండుకొనిపోవుచున్నది. నే నీపావురమును తినుటకై వచ్చితిని. నా నోటియొద్దనున్న యాహారమును నీ విటు పడఁగొట్టఁ దగునా ! నా యాఁకలి యిప్పుడు శాంతింప కుండినయెడల నేను నిశ్చయముగ మరణింతును. నేను చచ్చుటతోడనే నాభార్యయు పిల్లలును కడతేఱుదురు. ఒక్క పావురమును కాపాడఁదలఁచి యిన్ని ప్రాణులను పోఁగొట్టుట ధర్మమా? బాగుగా ఆలోచించుకొనుము. ధర్మమును గుర్తెఱుఁగుము. అదికాక, నేను తినఁగూడని యాహారమునుఅపేక్షింపలేదు. డేగలుపావురములనుతినునని వేదములు చెప్పుచున్నవి. కావున నీవుచేయుపని ధర్మమునకు విరుద్ధముగ నున్నది, అందుచే పావురమునువిడిచిపుణ్యమును కట్టుకొనుము."

ఈ మాటలు వినఁగానే చక్రవర్తి యిట్లు పలికెను.

"డేగా ! నీవు ధర్మ మెఱిఁగినట్లు చెప్పుచున్నావు. నీమాటలు న్యాయ్యము లైనవిగానున్నవి. కాని, యీపావురము కష్టకాలములో నామఱుఁగుఁ జొచ్చినది. దీనిని రక్షింతునని నేను నిశ్చయించుకొంటిని. ఇట్టిదిక్కుమాలిన పక్షిని అధముఁడై నను విడువఁ దగనప్పుడు దీనులనుకాపాడుటకు ఏర్పడినరాజనైన నేను దీనిని విడువఁ దగునా? అట్లుచేయుట మహాపాపము కాదా? నీవు ధర్మమెఱిఁగిన దానవు కావున మనవి చేసికొనుచున్నాను. నీకాఁకలి తీఱుటయే కావలసినదికాదా? ఏమాంసముతో కడుపునిండిన నేమి? పావురపు మాంసముకంటె రుచ్యములగు మాంసములను నేను నీకు పెట్టించెదను. వానిని భుజింపుము. నీకు ప్రాణములు నిలుచును. నాకు వ్రతమును నిలుచును."

ఈమాటలు వినఁగనే డేగ కొంత ఆలోచించి యిట్లనియెను.

"చక్రవర్తి చేసిన యాజ్ఞను మీఱఁగూడదు. ఈ పావుర మెంత యెత్తున్నదో అంత నీమాంసమును నాకాహారముగా ఇమ్ము."

"అభ్యంతర మేమి? మిక్కిలి సంతోషముతో ఇచ్చెదను" అని యాచక్రవర్తి పలికెను

అంతట నొక తక్కెడను తెప్పించి దాని యొక చిప్పలో పావురమును చక్రవర్తి యుంచెను కత్తి చేత పుచ్చుకొని తన మాంసమును కొంత కోసి రెండవచిప్పలో నుంచెను. పావురమే బరువుగా నున్నది మఱికొంత మాంసమును కోసి దానిలో నుంచెను పావురమే బరువుగా నున్నది గుమ్మడి పండంత మాంసమును కోసివైచినను పావురమే బరువుగా నున్నది కోయఁదగిన మాంసమంతయును కోసివైచెను పావురమే బరువుగానున్నది

చక్రవర్తి తెల్లఁబోయి చూచుచుండఁగా తక్షణమునను నంతలో ఇంద్రుఁడును అగ్ని దేవుఁడును అతని యెదుట ప్రత్యక్షమైరి వారిలో ఇంద్రుఁ డిట్లు పలికెను

"రాజోత్తమా! నేనింద్రుఁడను ఈతఁ డగ్ని దేవుఁడు. నీ దాతృత్వ మెంతో పరీక్షింపఁ గోరి నేను డేగనైతిని ఈతఁడు పావుర మయ్యెను. నీ దాతృత్వమునకు మెచ్చితిమి. నీ కీర్తి ప్రపంచ మున్నంతకాల ముండును నీ శరీర మెప్పటిరీతి నుండునట్లు వరమిచ్చితిమి"


ఇట్లు పలికి యింద్రాగ్నులు మాయ మైరి.

ప్రశ్నలు.—1 శిబిచక్రవర్తి పావురమును ఉజ్జగించినప్పుడు డేగ యాతనితో నేమనెను? 2. చక్రవర్తి దేమనిబదులు చెప్పెను? 3. డేగరూప

మును బొందినవా రెవ్వరు ? ౪. పావురపురూపమును బొందినవా రెవ్వరు ? ౫. వా రట్టి రూపములు ధరించుటకుఁ గారణ మేమి ? ౬. శిబిచక్రవర్తి యెట్టి వాఁడని ప్రసిద్ధిఁ గాంచెను.

మాటలు.—దాతృత్వము, ప్రసిద్ధి, వర్ణములు, పదార్థములు విఘ్నము, దానము, ఒడిలో, బుజ్జగించు, సత్యవంతుఁడు, ధర్మాత్ముఁడు, ఆహారము, శాంతించు, కడతేఱుదురు, అపేక్షించు, విరుద్ధము, న్యాయ్యములు, మఱుఁగుఁజొచ్చు, రుచ్యములు, ప్రత్యక్షమైరి, శరీరము, మాయమైరి.

---



## 15. కమ్మరి.

ఇండ్లు కట్టుకొనుటగాని, సేద్యము చేసికొనుటగాని, వడ్రంగియును కమ్మరియును లేకుండ సాగవు.

రెండవవాచక పుస్తకములో వడ్రంగిని గూర్చి కొంత చెప్పితిమి. ఇందులో కమ్మరిని గూర్చి వ్రాసెదము.

కమ్ములు, మేకులు, గొండ్లెములు, బందులు, నాగవాసములు, కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు, గునపములు, నాళములు, కఱుగోలలు, పాఱలు, తొల్లికలు—ఇట్టి యినుప పనిముట్లనేకములు కమ్మరి చేయును.

ఈపాఠముమీఁది బొమ్మచూడుము. ఒకఁడు రెండు చేతులతో తిత్తులనుఒత్తి కొలిమినిఊఁదుచున్నాఁడు. కొలిమిలోని బొగ్గులు బగ్గు బగ్గున మండుచున్నవి.

అదిగో! కమ్మరి కాఱుతో పట్టుకొని యొక యినుపముక్కను కాల్చుచున్నాఁడు. ఎఱ్ఱగా కాలిన పిమ్మట దానిని దాగటిమీఁద పెట్టి సుత్తెతో సాఁగఁగొట్టెను.

పెద్దపెద్దవి సాఁగగొట్టవలసివచ్చినప్పుడు, కమ్మరియెఱ్ఱగా కాలిన యినుమును కాఱుతో పట్టుకొని దాగటిమీఁద పెట్టును. మఱియొకఁడు నిలుచుండి పెద్దసమ్మెట రెండు చేతులతో పట్టుకొని సత్తువకొలఁది దాగటిమీఁద పెట్టిన యినుమును కొట్టును. కావలసి వచ్చినప్పుడు కమ్మరి యీ యినుమును కాఱుతో అటు ఇటు త్రిప్పుచుండును.

కొట్టుచున్నప్పుడు కాలిన యినుమునుండి మిణుఁగుఱు పురుగులవలె ఎఱ్ఱని నిప్పురవలు లేచుచుండును.

ఎఱ్ఱగా కాలినప్పుడు, ఇనుమును సాఁగఁగొట్టి ఏ యాకారము కావలసిన, ఆయాకారమునకు తీసికొని రావచ్చును.

తాళపుఁ జెవులు మొదలగు చిన్నసరకులు చిన్న ఆకుఱాతితో నునుపు చేయుదురు. పెద్దసరకులు నునుపుచేయుటకు పెద్ద యాకుఱా లుండును.

ప్రతి గ్రామమునందును ఒకకమ్మర దుకాణముండును. ఊసుపోని యూరివా రచ్చోటికివచ్చి ఆమాటలు ఈమాటలు చెప్పు

కొనుచుందురు. వచ్చిన వారిలో కొందఱు వేడుకకై సమ్మెట తోనో కొలిమి తిత్తులతోనో పని చేయు చుందురు.

కమ్మరపని చేయువారి గుడ్డలు నల్లగా మాసిపోవును.

ప్రశ్నలు:—1. కమ్మరి యేయేపనిముట్లు చేయును? 2. సమ్మెటతోఁ గొట్టుటకుముందినుమును గొలిమిలో నేల కాల్పవలెను? 3. ఆకుటాయి కమ్మరి కేల కావలెను? 4. పల్లెలలోఁ గమ్మర దుకాణమున కెవరెవరు వచ్చి యేమేమి చేయుదురు? 5. కమ్మరి గుడ్డలు మాసిపోవుట కేమి కారణము?

మాటలు.—నాగవాసము, కఱుగోల, దాగలి, తొల్లిక, సుత్తె, సమ్మెట, మిణుఁగుఱులు, ఊసుపోనివారు.

---



## 16. దూది దొంగలు.

తురుష్కుల దేశములోని ముఖ్య పట్టనమున నొక గొప్ప దూది వర్తకుఁ డుండెను. ఆతని యింటి కొక రాత్రి కన్నము త్రవ్వి కొందఱు దొంగలు దూదిని దొంగిలించిరి. ఆ దూది వర్తకుఁ డుదయముననే, ఫాదుషాతో ఫిర్యాదు చేసెను. అంత

గొప్పపట్టనములోదూది దొంగిలించిన వారిని బట్టుకొనుట మిక్కిలి కష్టముకాదా?

పాదుషా తన ప్రధానుని పిలిచి దొంగలను బట్టుటకు తగిన యాలోచనను చేయుమని ఆజ్ఞాపించెను. ప్రధానుం డట్లే చేయుదునని ప్రభువుతో వినయముస మనవి చేసికొని తన యింటికి పోయెను

ఆ దినముననే ప్రధానుం డొక గొప్ప విందుచేసెను. ఆ పట్టనములోనితురకలను అందఱను పిలిచెను. వారందఱు స్నానములుచేసి శుభ్రములగు వస్త్రములను ధరించి,ప్రధానుని యింటికి వచ్చి భోజనశాలలో మాటలాడుకొనుచు కూరుచుండిరి. కొందఱు పాదుషాగారి దాతృత్వమును కొనియాడుచుండిరి. కొందఱు ప్రధానుని తెలివినిగుఱించి మాటలాడుకొనుచుండిరి. కొందఱు కూరల రుచులను గుఱించి ముచ్చటించుకొనుచుండిరి. కొందఱు తమతమ యిండ్లలోని తగవులను వెలిపుచ్చుచుండిరి. పిసినిగొట్టు దూదివర్తకునకు తగినశిక్ష యయినదని కొందఱు గుసగుస లాడుకొనుచుండిరి.

తెల్లబట్టలను రత్నకంబళములపై పఱిచినారు. వానిపై మహామ్మదీయు లందఱు పంక్తులు దీర్చి కూరుచున్నారు. వడ్డన సానికలు వచ్చుట యారంభమైనది.

అంతలో ప్రధానుఁడు లోపలినుండి భోజనశాలలోనికి వచ్చిబారులు దీర్చి కూరుచుండిన అతిథులందఱను దేఱిపాఱఁ జూచెను. ఇట్లు రెండు మూఁడు పర్యాయములందఱను బాగుగా చూచి యొక్క పెద్దనవ్వునవ్వెను. ప్రధానుఁ డేల నవ్వెనో తెలిసికొనలేక యందఱును తెల్లఁబోయిరి. ప్రధానుఁ డిట్లు బిగ్గరగా పలికెను.


"చేసిన దొంగతనమును కప్పుకొనుటకు తగిన తెలివి లేనప్పుడు దొంగతనము చేసిన లాభమేమి? ఎవ్వరో దూదిని దొంగిలించినారు. సరే, వారు స్నానముచేసి విందునకు వచ్చినప్పుడైనను గడ్డముల కాదూదికణము లేవియైన తగులుకొని యున్నవేమో రవంత చూచుకొనక్కఱలేదా?"

ఈమాటలు ప్రధానుఁడు పలుకఁగానే కొందఱు మొగము లడ్డము చేసికొని తమ గడ్డములను గట్టిగా తుడుచుకొనిరి. వారు దొంగలని ప్రధానుఁడు కనిపట్టెను.

ప్రశ్నలు:—1. రాజు ప్రధానున కేమి యాజ్ఞాపించెను? 2. ప్రధానుఁడు దొంగల నెట్లు గుర్తించెను?

మాటలు.—ఆజ్ఞాపించెను, వినయము, శిక్ష, రత్నకంబళము, సానిక.

## 17. గద్ద.



గద్ద ప్రపంచమం దంతటను కాన్పించు పక్షి. గద్దలు ఎత్తైన చెట్ల మీఁదను కొండలమీఁదను గూండ్లు కట్టుకొని యుండును.

దాని పొడుగు సుమా రొక యడుగు ఉండును.

అది మాంసము తిని బ్రతుకు పక్షులలో నొకటి.

పిల్లికిని కుక్కకును మాంసమును చీల్చుటకు వాఁడి యగు కోఱ లెట్లుండునో అట్లే మాంసముతిను పక్షులకు ముక్కు వంకరగాను, వాఁడిగాను, దృఢముగాను ఉండును.

గద్దకన్నులు చిన్నవి. అది కడుదూరము చూడఁగలదు.

ముక్కునకును కన్నులకును తగినట్లే గోళ్లుకూడ అంపపు పండ్లవలె వంగి వాఁడిగా నుండును.

కప్ప, పాము, చేఁప, కోడిపిల్ల మొదలగువానిని గోళ్లతో గ్రుచ్చి తన్నుకొనిపోయి గూఁటిలో పెట్టుకొని తినును.

గద్ద ఆకాశమున తిరుగుచు తనయెరకు తగినజంతువును దిగువ చూడఁగానే తటాలున బాణవేగముతో దిగి దానిని పట్టుకొని ఎగిరిపోవును.

గద్దలలో రెండుజాతు లున్నవి. అందులో ఒకటి కొంచెము నల్లగా నుండును. రెండవది యెఱ్ఱ యెఱ్ఱగాను, బొర దగ్గఱ తెల్లగాను ఉండును. దానికూఁత "కృష్ణా" అనినట్లు వినఁబడును.

హిందువులు దానిని విష్ణువాహనమైన గరుత్మంతునిగా భావించి నమస్కరించెదరు.

గద్ద ఇండ్లమీఁద వాలినయెడల, కీడు మూఁడునని హిందువులలో కొందఱి నమ్మకము.

అది ఆకాశమున ఎత్తుగా చక్రములు తిరుగుచు అప్పుడప్పుడు ఱెక్కలాడించుచు పోవుచుండును. ఒకప్పుడాకాశముమీఁద మిక్కిలి యెత్తుగా నున్నప్పుడు చిన్న మచ్చవలె కాన్పించును.

గద్దలను చూడవలె నన్నయెడల దాదాపుగా పట్టి పోయిన పంట చెఱువులలో బెస్తలు చేఁపలు పట్టుకొనునప్పుడే చూడవలెను. పందల కొలఁది గద్దలాకాశమున తిరుగుచుండును. చేఁపలు కంటఁబడినచో కొన్ని తటాలునవాలి వానిని తన్నుకొని పోవును. పొట్టనిండ మెక్కినగద్ద, చుట్టుపట్ల నున్న యేదో యొక్క చెట్టుమీఁద వాలి, సంగనాచివలె కూర్చుండును. ఇదంతయు చూచుట కెంతో వింతగా నుండును.

ప్రశ్నలు:—1. గద్ద యెక్కడ గూండ్లు కట్టుకొనును? 2. అవేమి తినును? 3. గద్దలను విస్తారముగా యెక్కడఁ జూడఁగలవు?

మాటలు.—ప్రపంచము, దృఢము, తటాలున, విష్ణువు, వాహనము, గురుత్మంతుఁడు, బెస్తలు, వంగనాచి.

---

# 18. పొడుగు, వెడల్పు, ఎత్తు, విరివి.

రాముఁడు.—గోపాలా! అడుగు బద్దతో కొలుచుకొని యెవ రెవ రెంతయెత్తున్నారో చెప్పుఁడని గురువుగారు నిన్న మనతో సెలవిచ్చిరికదా; నీవట్లు చేసినావా?

గోపాలుఁడు.—ఆ! చేసినాను. చేతితో బద్ద పుచ్చుకొని, వంగి, మొట్టమొదట అడుగు దగ్గఱనుండి మొలవఱకు కొలుచుకొంటిని. తరువాత నిట్టనిలఁబడి మొలదగ్గఱనుండి తలవఱకు కొలుచుకొంటిని. నేను మూఁడడుగుల పది యంగుళము లున్నాను—నవ్వుచున్నావేమి?



రా.—నేను మఱియొకలాగున చేసితినిలే.

గో.—ఏలాగున?

రా.—వీఁపును కాలి మడమలును గోడకు అంటునట్లు సరిగా నిలఁబడితిని. చేతిలో నున్న పచ్చ పెన్సిలుతో నా యెత్తును గోడమీఁద గుఱుతుపెట్టితిని. తరువాత అడుగుబద్దతో ఆగుఱుతువఱకున్న గోడ కొలిచితిని. మూఁడడుగుల యెనిమి దంగుళము లున్నది. అదే నా యెత్తు.

గో.—అయ్యో! నాకాఉపాయము తోఁచేలేదు. నీవు తెలివైనవాఁడవు. గదుల కొలతలుకూడ చూచుకొని చెప్పవలసినదని గురువుగారు చెప్పినారే, అవి యెట్లుకొలిచినావు?

రా.—నీ వేలాగున చేసినావో మొట్టమొదట చెప్పిన తరువాత నేను చెప్పెదను.

గో.—నీ గదివలెనే నాగదికూడ ఎత్తైన మిద్దెగది. అంత యెత్తు ఒక్కమాటుగా కొలువలేక పోయితిని. నాకందినవఱకు బద్దతో కొలిచినాను. అక్కడ గోటితో గీఁకినాను.

ఎత్తు పీఁటవేసికొని, దానిమీఁద నిలుచుండి, గీఁతదగ్గఱనుండి మఱి కొంతయెత్తు కొలిచినాను.

అక్కడ మఱల గుఱుతు పెట్టుకొని, నిచ్చెనవేసికొని, మిద్దెవఱకున్నయెత్తు కొలిచినాను.

ఆలాగుననే నాలుగు గోడలయెత్తును కొలిచినాను. నాలుగును నాలుగేసి గజముల యెత్తే యున్నవి.

తరువాత క్రింది నాలుగు వైపులు సుళువుగానే కొలిచినాను. రెండుప్రక్కలాఱేసిగజము లున్నవి. రెండు నాలుగేసియున్నవి. నీగది యేలాగు కొలిచినావో చెప్పవా?


రా.—చిన్నగడ కొక తాడుగట్టి యెత్తితిని. సరిగా గోడ యెత్తునన్నున్న తాటిక్రింద కాలి బొటనవ్రేలితో నొక్కిపట్టితిని. తరువాత అది యెంతయున్నదో కొలిచి చూచితిని. మూఁడుగజముల రెండడుగు లున్నది.

అన్నిగోడలు సమానమైన యెత్తుకలవే కనుక తక్కిన మూఁడు గోడలు కొలువలేదు.

క్రింది భాగమును నీవలెనే కొలిచితిని. కాని అన్ని ప్రక్కలును కొలువలేదు. గదులకు రెండు పొడుగులును సమానములు. రెండువెడల్పులును సమానములు; కనుక, కలిసియున్న రెండువైపులుమాత్రమే కొలిచినాను. అయిదేసిగజములున్నవి. అన్నివైపులైదేసి గజములే కనుక నాగది చేదరపుగది.

గో.—అలాగైన యెడలనీగది చుట్టుకొలతయు నాగదిచుట్టు కొలతయు ఒకటే-రెండును ఇరువదేసి గజములే.

| | | | | |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |



| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 2 | | | | | |
| 3 | | | | | |
| 4 | | | | | |

రా.—ఔను గాని, విరివిలో ఒకటి కొంచెము పెద్దది.

గో.—వట్టి టక్కరిమాట.

రా.—ఇదిగో! చూడు! నీగదియు నాగదియును కొలతలతో కూడ గీసికనంబఱచెదను. ఏదిపెద్దదో నీవే చెప్పఁగలవు.

గో.—ఔను-నీబుద్ధి నాబుద్ధికంటె పెద్దదైనట్లే, నీగదియు నాగదికంటె పెద్దది. చిన్నగళ్లు సమానములే కాని, అట్టివి నీగదిలో ఇరువదయైదున్నవి, నాగదిలో ఇరువది నాలుగు మాత్రమే యున్నవి.

ప్రశ్నలు:— 1. రాముని కొలతలోను గోపాలుని కొలతలోను ఎవరి కొలత పద్ధతి మంచిది? ఎందుచేత? 2. సామాన్యముగా గదులలో నొక నిడుపు-నొక వెడలుపు గొలిచినయెడల ఏల చాలును? 3. రెండు గదులు సమానములని గోపాలునికి భ్రమ యేల కలిగెను? ఏది పెద్దది? ఎందుచేత?

మాటలు.—నిట్టనిలఁబడి, చుట్టుకొలత, విరివి, టక్కరిమాట.

---

# 19. పగలు, రాత్రి.

## సూర్యకాంతము—చంద్రకాంతము.

సూ.—చంద్రకాంతమని నీకు తగిన పేరు పెట్టినారు. నీముఖము చూచి యింక చంద్రుని చూడ నక్కఱలేదు.

చం.—నీ మాటల చమత్కారముకాని నా ముఖమునకును చంద్రునికిని సంబంధ మేమున్నది?

సూ.—ఉన్నదో లేదో నీపేరే చెప్పుచున్నది.

చం.—ఆలాగైన, నీపేరు సూర్యకాంతము కనుక, నీముఖ మెవ్వరును తేఱిపాఱఁ జూడ లేక పోవలెను.

పెద్దలు పెట్టిన ముద్దుపేర్లకును పిల్లల లక్షణములకును ఎంతో భేదముండును. చూచినావా, మొన్నను సత్యవతి అబద్ధమాడఁగా పంతులుగారు శిక్షించినారు. పేరు సత్యవతి; ఆడినది అబద్ధము.


సూ.—మాటకర్తైవు, నీవో నేనో యిప్పుడు తెలియుచునే యున్నది. వేయి చెప్పినను నీపేరు రాత్రిది, నా పేరు పగటిది.

చం.—ఆలాగే కానిమ్ము. నీవు పాటుపడి చేదువుదానవు. నేను పట్టి నిదురపోతును.

సూ. అందుచేతనే కాఁబోలు నిన్నను—పగలు, రాత్రి— పాఠములో నీకందఱికంటెను ఎక్కువ 'మార్కులు' వచ్చినవి. వీని కన్నిటి కేమిగాని, నాకాపాఠము బాగుగ బోధపడ లేదు, చెప్పెదవా?

చం.—నాకు తెలిసినంతవఱకు చెప్పెదను. సాధనములు లోపలనున్నవి. వెళ్లుదముఱా !

సూ.—పంతులుగారియొద్దవలె నీదగ్గఱ భయము లేదు కనుక, నాకు పూర్తిగా తెలియువఱకు నిన్నడుగుచుందును.



చం.—నాకు పరమ సంతోషము. ఇదిగో ! చూడు ! ఈ గుండ్రముగానుండు గోళమే భూమి అనుకొనుము. ఎదుటి దీపమే సూర్యుఁ డనుకొనుము.

సూ.—సరేకాని, గోళము కదలుచున్న దేమి ?

చం.—మన భూగోళమును కదలుచునే యున్నది. బొంగరము వలె తనచుట్టు తాను తిరుగుచున్నది. అది చూపించుటకే యీగోళమును త్రిప్పుటకు వీలుగా అమర్చినారు. జాగ్రత్తతో చూచి చెప్పు. ఈగోళము రెండుప్రక్కల మీఁదను దీపపుకాంతి పడుచున్నదా ?

సూ.—లేదు. దీపమువైపు భాగమునకు వెలుతురున్నది. తక్కిన భాగమునకు వెలుతురు లేదు.

చం.—గోళములో ఎంత భాగమునకు వెలుతురు తగులు చున్నది? ఎంత భాగము చీఁకటిలో నున్నది?

సూ.—వెలుతురును చీఁకటియు చెఱిసగముగా ఉన్నవి.

చం.—ఇట్లే సూర్యకాంతిపడు భాగమును, పడని భాగమును భూమిపై ఎప్పుడును సమముగా నుండును.

సూ.—సరే తెలిసినది. మొదటి భాగము వారికి పగలును, మిగిలిన వారికి రాత్రియును కాని, కొందఱి కెప్పుడును పగలును, కొందఱి కెప్పుడు రాత్రియునా?

చం.—కాదు. భూమి కదల కుండిన నీవు చెప్పినట్లగును. కాని, భూమియెప్పుడు కదలుచునే యుండు నని యింతకు ముందు చెప్పితిని గదా! అప్పుడే మఱచితివా? ఈ గోళ మును త్రిప్పెదను. ఏమి జెరుగునో చూచి చెప్పు.

సూ.—ఓహో! వెనుక వెలుతు రున్న భాగములు చీఁకటిలో, పడుచున్నవి. చీఁకటిలోనివి వెలుఁగునకు వచ్చుచున్నవి.

చం.—కనుక ?

సూ.—ఒక దేశమువారికే కొంత సేపు వెలుతురు, కొంత సేపు చీఁకటి—కొంత సేపు పగలు, కొంత సేపు రాత్రి.

చం.—అట్లే ఎల్ల వారికిఁ గొన్నాళ్లు సుఖము, కొన్నాళ్లు కష్టము అనికూడ తెలిసికొనుము.

ప్రశ్నలు:— 1. 'సత్యవతి' యనఁగా అర్థమేమి? 2. చంద్రకాంతము సత్యవతిమాట యేల చెప్పవలసి వచ్చెను? 3. ఏ పేరు రాత్రిది? ఏది పగటిది? ఎందుచేత? 4. జనుల కెప్పుడు పగటివేళ? ఎప్పుడు రాత్రి వేళ? 5. భూమిమీఁదఁ గొందఱికిఁ బగలైనప్పుడు మఱికొందఱకు రాత్రి కావచ్చునా? కారణమేమి?

మాటలు:— మాటకత్తె, లక్షణము, తేఱిపాఱఁ జూచుట, గోళము.



# 20. భారత కథాసంగ్రహము.

రాజులలో సూర్యవంశపు రాజులని చంద్రవంశపు రాజులని రెండు తెగ లున్నవి. ధృతరాష్ట్రుఁడని పాండురాజని యిద్దఱు చంద్రవంశపు రాజు లుండిరి. వీరన్నదమ్ములు. ధృతరాష్ట్రుఁడు పుట్టు గ్రుడ్డివాఁడు. గ్రుడ్డితనము వలన రాజ్యమునకు తగని వాఁడయ్యెను, ధృతరాష్ట్రుఁడే రాజ్యము చేయుచుండెను. పాండురాజు బలముకలవాఁడై అనేకరాజుల నోడించి యెక్కువ సొమ్ము సంపాదించి ధృతరాష్ట్రున కిచ్చుచుండెను.

ధృతరాష్ట్రుని భార్య గాంధారి. వీరికి నూఱుగురుకొడుకులు పుట్టిరి. వారిలో దుర్యోధనుఁడు పెద్దవాఁడు. పాండురాజునకు కుంతి పెద్దభార్య. మాద్రి చిన్నభార్య. కుంతికి, ధర్మరాజు, భీముఁడు, అర్జునుఁ డని ముగ్గురు కొడుకులు పుట్టిరి. మాద్రికి నకులుఁడు, సహదేవుఁ డను ఇద్దఱు కొడుకులు పుట్టిరి. పాండురాజు మృతినొందిన పిమ్మట, ధృతరాష్ట్రుఁడే తమ్ముని కొడుకులగు పాండవులను తన నూర్గురుపుత్త్రులతో సమముగా చేరాచే చే పెంచుచుండెను. విద్యలెల్ల చెప్పించుచుండెను.

దుర్యోధనాదులు మంచివారు కారు. పాండవుల బలమును మంచితనమును చూచి, అసూయపడి; వారి కనేకవిధముల కీడుచేయుట కెంచిరి. ప్రజలకు పాండవులయం దనురాగము, గౌరవము హెచ్చుగానుండెను. ధృతరాష్ట్రుఁడు ధర్మరాజును యువరాజుగా చేసెను.

దుర్యోధనుఁ డందులకై మిగుల నసూయపడి పాండవులను హస్తినాపురమునుండి వెళ్లఁగొట్టవలసిన దని తండ్రికి దుర్బోధ నము చేసెను. కొడుకుమాట మీఱఁజాలక యతఁడు వారిని వారణావతమునకు పంపెను. అక్కడ వారిని లక్కయింటిలో పెట్టి కాల్చి చంపుటకు దుర్యోధనుఁడు కుట్రచేసెను. కాని, కాలుచున్న యింటినుండి వారు తప్పించుకొని పాఱి పోయిరి. వారు మరణించిరని దుర్యోధనాదులు సంతోషించిరి.

పిమ్మట పాండవు లనేక దేశములు తిరిగిరి. బకాసురుఁడు మొదలగు కొందఱు దుష్టులను చంపిరి. ద్రుపదుఁడనువాని రాజ్యమునకువచ్చి యాతని కూఁతురగు ద్రౌపదిని పెండ్లి చేసి కొనిరి. వీరి మేనమామ కొడుకే శ్రీకృష్ణమూర్తి. ద్రుపదుని రాజ్యమున పాండవు లున్నారని తెలిసి ధృతరాష్ట్రుఁడు పెద్దల యాజ్ఞననుసరించి, వారిని పిలిపించి, వారికి సగము రాజ్యము మాత్రమిచ్చి, ధర్మరాజునకు పట్టముగట్టించి, ఖాండవప్రస్థమున నివసించి మీ రేలుకొనుఁడని వారిని బంపివేసెను. ధర్మరాజొక గొప్ప యజ్ఞముచేసెను. విచిత్రమైన యొక సభను కట్టించెను. యజ్ఞమును చూచుటకు దుర్యోధనాదులు వచ్చిరి. ధర్మరాజు యొక్క ఐశ్వర్యమును జూచి, సభచిత్రమును చూచి యసూయ పడిరి. దుర్యోధనుఁడు వారి రాజ్యమును హరింపఁదలఁచి తన మేనమామ యైన శకునిచేత ధర్మరాజుతో జూదమాడించెను.

ధర్మరాజు రాజ్యమును ఓడిపోయెను. తన్ను సోదరులను భార్యను కూడ ఓడి పోయెను.

దుర్యోధనుని తమ్ముఁడైన దుశ్శాసనుఁడు పాండవుల భార్యయైన ద్రౌపదిని సభలో అవమానింప ప్రయత్నించెను. కాని, శ్రీ కృష్ణమూర్తి యామె మర్యాదను కాపాడెను. పాండవులు జూదములో ఓడిపోయిన వారగుటచేత ఏమియు చేయఁజాలక ఊరకుండిరి. పండ్రెండేండ్లు వనవాసమును, ఒకయేఁడజ్ఞాతవాసమును చేయుట కొప్పుకొని పాండవు లడవికిఁబోయిరి.

ఈ రెండు వ్రతములు మిక్కిలి కష్టముతో పూర్తిచేసికొని పాండవులు 'మా రాజ్యము మాకి' మ్మని, కృష్ణుఁడు మొదలగు వారిచేత ధృతరాష్ట్రునకు రాయబారము పంపిరి. దుర్యోధనుని దుర్బోధనముచేత ధృతరాష్ట్రుఁడు వారికి రాజ్య మీయలేదు. కురుక్షేత్రమున పాండవులకు దుర్యోధనాదులకు పదునెనిమిది దినములు లోక గొప్పయుద్ధము జరిగెను. దానిలో పాండవులు జయించిరి. ధర్మరాజునకు పట్టాభిషేక మయ్యెను.


వ్యాసుఁడు భారతమును సంస్కృతమున వ్రాసెను. భారతమునకు పదునెనిమిది పర్వములు. నన్నయభట్టు, తిక్కనసోమయాజి, ఎఱ్ఱప్రెగడ అను ముగ్గురు తెలుఁగు కవులు భారతమును తెలుఁగు చేసిరి.

ప్రశ్నలు:—1. రాజులలో రెండు తెగ లేవి? 2. ధృతరాష్ట్రుని పెద్ద కొడు కెవరు? 3. పాండవు లెందఱు? 4. పాండవులు వారణావతమునకుఁ బోవుట కేమి కారణము? 5. అక్కడ వారే యుపాయమునుండి తప్పించుకొనిరి? 6. శకునియెవఁడు? అతఁడు ధర్మరాజుతో జూదమేల యాడెను? 7. అజ్ఞాతవాసమైన తరువాతఁ బాండవు లేమని రాయబారమంపిరి? 8. భారతయుద్ధ మెక్కడ జరిగెను? ఎన్నిరోజులు జరిగెను? 9. ఎవరు గెల్చిరి?

మాటలు.—మృతినొందెను, అసూయ, గౌరవము, యువ

రాజే, దుర్యోధనము. కుట్ర, దుష్టులు, పట్టముగట్టించి, యజ్ఞము, ఐశ్వర్యము, చిత్రము, హరించు, వనవాసము, అజ్ఞాతవాసము, రాయబారము, పర్వములు.

---



## 21. పులి.

పిల్లిని గుఱించి నీవు రెండవవాచకపుస్తకమునందు చదివి యున్నావు. పిల్లిజాతిలో చేరిన మృగములు మఱికొన్ని కలవు. వానిలో పెద్దపులి యొకటి.

అదెప్పుడును, అడవులలో వాసస్థాన మేర్పఱచుకొనును.

పులితల, పిల్లితలవలెగుండ్రముగా,నుండును. దానికన్నులు, చెవులును, పిల్లికివలెనే యుండును. అదియును మాంసముతిని బ్రతుకును. కనుక పులికిని వాఁడిగల కోఱలుండును. దాని పాదములు, గోళ్లు, పిల్లికివలెనే యుండును.

పులి శరీరము పచ్చనిది. దానిమీఁది చాఱలు నల్లవిగాను, పెద్దవిగాను ఉండును.

పులి, పిల్లికంటె మిక్కిలి పెద్దజంతువు. సాధారణముగా అది మూఁడునఱ యడుగులయెత్తును, ఎనిమిదియడుగుల పొడుగును ఉండును. అది చూచుటకు మిక్కిలి భయంకరమైన జంతువు.

అడవిమాఱుమ్రోఁగునట్లది "కాండ్రు" మని అఱచును.

అడవిప్రదేశములలో పశువులు మేయుచున్నప్పుడు, ప్రక్కనున్న పొదల మాటునఁగాని, యెత్తైన గడ్డిలోనుండికాని, చడి చప్పుడు లేకుండ తాఱుచుపోయి, వానిముందఱపులి నక్కియుండును. అట్లుండి సమీపముగా వచ్చినపశువు మీఁదికి చటాలున పోయి, పంజాలతో ముందుకాళ్లపైఁగొట్టి పట్టుకొని, గొంతుక కొఱికి మెడ విఱిచివేయును. ఆపశువును దూరముగా ఈడ్చుకొనిపోయి కడుపునిండఁ దినును. మిగిలిన భాగమును ఒకచోట ఆకులతో కప్పిపుచ్చి, కావలసినప్పుడు వచ్చి తినుచుండును.

ఒక యెద్దుమాంసము పులికి మూఁడురోజులకు సరిపోవును. తరువాత రెండురోజు లాహారమేమియు తినకే యుండునఁట.

అదియెద్దులను ఆవులనే కాక, లేళ్లను, మేఁకలను, గొఱ్ఱెలనుకూడ తినును.

పులి, దూరమునుండి పశువుమీఁదికి దుమికి, పంజాతోఁ గొట్టి, గొంతుకను గోళ్లతో చీల్చి, రక్తమును పీల్చి చంపునని చెప్పుదురు; కాని, అది నిజము కాదఁట.

పులి నిట్టనిడుపుగా ఉన్న చెట్టెక్కలేదు. కనుక పులివచ్చుచోట వేఁటకాండ్రు అట్టి చెట్లమీఁద మాటులు కట్టుకొని, ఎరకై మేఁకనుగాని మఱియొక జంతువునుగాని సమీపమున కట్టియుంచి, చూచుచుండి, అది వచ్చినప్పుడు తుపాకితో దానిని చంపుదురు.

పులిపిల్లలను పట్టుకొనిబోనులలోనుంచి రాజులు, వేడుకకై

పెంచెదరు. మచ్చికచేసినపులులను సర్కసులో బయటికి తెచ్చి ఆటలాడించెదరు. ఆటలాడించువారప్పుడు - తమప్రాణము లను చేతఁబెట్టుకొని యుందురు.

ప్రశ్నలు:—1. పులి, పిల్లిజాతిలోని దని యేల చెప్పుదురు? 2. అదెక్కడనుండును? 3. అది వేనిని దినును? 4. అది జంతువు నెట్లు చంపును? 5. పులుల నెట్లు చంపుదురు?

మాటలు:—వాసస్థానము, మాఱుమ్రోఁగుట, మాటలు, తాఱుట, నక్కుట, సర్కసు.

---

# 22. సూర్యుఁడు, భూమి, చంద్రుఁడు.

మనము పడవలోఁగాని రెయిలుబండిలోఁగాని పడమటి నుండి తూర్పునకుఁ బోవుచున్నా మనుకొందము. అప్పుడు ప్రక్కనున్న కాలువగట్టును, చెట్లును, టెలిగ్రాఫు స్తంభములును తూర్పునుండి పడమటికిఁ బోవుచున్నట్లు కనఁబడును.


రెండు రెయిలుబండ్లు స్టేషనుముందు నిలఁబడి యుండఁగా, అందొకటికదలి యొకప్రక్కకుఁ బోవునప్పుడు, రెండవది నిజముగా కదలకపోయినను, రెండవ ప్రక్కకుఁ బోవుచున్నట్లు, మొదటి బండిలోని వారికి కనఁబడునుగాదా!

అట్లే భూమి తిరుగుచుండుటచేత సూర్యుఁడు తిరుగుచున్నట్లు మనకు కనఁబడును.


భూమి, తిరుగుచుండుట వలన, దివారాత్రములు కలుగుచున్నవని యింతకుముందు చదివియుంటివి. అట్లు తనచుట్టును తిరుగుటయే కాక, భూమి సూర్యునిచుట్టునుగూడ తిరుగును. ఒక పర్యాయము భూమి సూర్యుని చుట్టివచ్చుటకు సుమారు

మూఁడువందల అఱువదియైదు రోజులు పట్టును. ఈకాలమున కే సంవత్సర మని పేరు.

భూమి సూర్యునిచుట్టును తిరుగుచున్నట్లు, చంద్రుఁడు మనభూమిచుట్టును తిరుగుచున్నాఁడు. అట్లొకపర్యాయము తిరిగివచ్చుటకు రమారమి ముప్పదిరోజులు పట్టును.




పటమున సూర్యుని చూడుము. సూర్యునిచుట్టును భూమి పోవు మార్గమున్నది. చంద్రుఁడుభూమిచుట్టును పోవుమార్గము కూడ కనఁబడుచున్నది. చంద్రుఁడు భూమిచుట్టును పోవుచు "అ" యొద్దనున్నప్పుడు, సూర్యుఁడును చంద్రుఁడు ఒక్కసారి ఉదయించి యొక్కసారి అస్తమింతురు. కనుక ఆరోజున మనకుచంద్రుఁడు కనఁబడఁడు. ఆరోజును "అమావాస్య" యందురు. అమావాస్య వెళ్లిన పదునేనురోజులకు చంద్రుఁడు "పౌ" యొద్దకు వచ్చును. అప్పుడు సూర్యకాంతి, చంద్రుని మీఁద, మనభూమి వైపుననున్న ప్రక్కను అంతటను పడును. కనుక, ఆరోజున చంద్రుఁడు పూర్ణముగా కనఁబడును. ఆరోజును "పౌర్ణిమ" యందురు.




అమావాస్య మఱునాఁడు మొదలు, పౌర్ణిమవఱకుఁగల రోజులను శుక్లపక్ష మందురు. శుక్లపక్షమున వెన్నెల క్రమముగా హెచ్చును.

పౌర్ణిమ మఱునాఁడు మొదలు అమావాస్య వఱకును గల రోజులను కృష్ణపక్ష మందురు. కృష్ణ పక్షమున చీఁకటి క్రమముగా హెచ్చును.

ప్రశ్నలు:—I. మన భూమి తిరుగుచున్నట్టు లెట్లు చెప్పఁగలవు? 2. సంవత్సరమని దేనికిఁ బేరు? 3. అమావాస్యనాఁడు చంద్రుఁడేల కనఁబడఁడు? 4. పౌర్ణిమనాఁడు భూమియు, సూర్యుఁడును, చంద్రుఁడును ఎట్లుందురో గీసి చూపుము. 5. శుక్లపక్షమని దేనికిఁ బేరు? 6. కృష్ణపక్షమని దేనికిఁ బేరు?

మాటలు.—పర్యాయము, పూర్ణముగా, హెచ్చుట.

---

## 23. పరమశాంతుఁడు.

ఒకయూరిలో నొకమంచి మనుజుఁడుండెను. అతఁడు కోపమెన్నఁడును ఎఱుఁగనివాఁడు. అతనికొక సేవకుఁ డుండెను. ఈ సేవకుఁ డాతనిని ముప్పదిసంవత్సరముల నుండి సేవించుచుండెను. ఈముప్పదియేండ్లలో ఆతఁ డొకసారియైన కోప పడలేదని యీ సేవకుఁడు చెప్పుచుండెను. కోపము గలిగిన మనుజుఁడు

ముప్పదియేండ్లలో నొక్కమారైనను కోపపడకుండునా ?

ఆ యూరిలోని కొందఱు జను లాతనికి కోపమున్నదో లేదో నిశ్చయముగా తెలిసికొనఁదలఁచిరి. ఆతని సేవకుని ఒక దినమున పిలిచి యెటులైన ఆతనికి కోపము తెప్పించినయెడల గొప్ప బహుమాన మిచ్చెదమని వానికి ఆశ పెట్టిరి. వీఁడందులకు సమ్మతించెను.



ఆనాఁటిరాత్రి సేవకుఁడాతనికి పక్కపఱచుట మానివేసెను. ఆతనికి ఒక్క అలవాటున్నది. పక్కయెంతో పరిశుభ్రముగా ఉండవలెను. ముడుతలులేకుండ సాపుగా పక్కపఱచి యుండవలెను. అట్లుండిననేకాని యాతఁడు నిద్రపోఁడు. ముప్పదిసంవత్సరములనుండి యీసేవకుఁ డాతని పక్కను మిక్కిలి భద్రముగా అతని మనసునకు నచ్చినట్లుగా వేయుచుండువాఁడు. ఆ నాఁటిరాత్రి సేవకుఁ డాతనిపక్కను ముట్టనే లేదు.

రాత్రి పక్కయేల వేయలేదనిమఱునాఁటి యుదయమున ఆతఁడు సేవకు నడిగెను. వాఁడు విని విననట్లు 'మఱచితిని కాఁబోలు' నని నిర్లక్ష్యముగా చెప్పెను.'క్షమింపు'మని కోరనే

లేదు. 'ఇంతటినుండి జాగ్రత్తతో వేయుదు'నని చెప్పనైన లేదు. ఆతని కెట్లు లైనను కోపమువచ్చునట్లు చేయఁదలఁచినవాఁడట్టు లేలచెప్పను? ఆరాత్రికూడ సేవకుఁడాతనిపక్క ను వేయలేదు.

'రాత్రిపక్క యేలవేయలే' దని మఱునాఁ డాతఁడు సేవకు నిలడిగెను, 'ఏమో!జ్ఞప్తిలేకపోయిన'దని నిర్భయముగా సేవకుఁ డాతనికి బదులు చెప్పెను.

అప్పు డాతఁడు సేవకునితో నిట్లనియెను.

"నీ విఁక నాపక్క వేయఁదలఁచుకొనలేదు కాఁబోలు. చిరకాలమునుండి దానిని వేసి శ్రమపడి యున్నావు. ఇఁక వేయుటకునీకు విసుగుగానుండిన నుండవచ్చును. పోనిమ్ము, నేనే వేసికొందును. రెండురాత్రులనుండి వేసికొనుటచేత నాకు కొంత యలవాటైనది."

ఈమాటలువినఁగనే సేవకుఁ డాతని కాళ్లపైఁబడి జనులు చేసిన కుట్రయు తన నేరమంతయు ఒప్పుకొని క్షమింపుమని వేఁడుకొనెను.

ప్రశ్నలు.—1 ఊరిలోని జనులు సేవకునితో నేమి కుట్రచేసిరి? 2. సేవకుఁడు గూడఁ గుట్రలోఁగలిసి యేమిచేసెను? 3. పరమశాంతుఁడు తుదకు సేవకునితో నేమనెను? 4. అందుపై సేవకుఁ డేమిచేసెను?

మాటలు.—సేవకుఁడు, నిశ్చయముగా, బహుమానము, సమ్మతించెను, పరిశుభ్రముగా, భద్రముగా, నిర్లక్ష్యముగా, క్షమింపుము, జాగ్రత్త, జ్ఞప్తి, నిర్భయము, చిరకాలము, శ్రమపడు.

---

## 24. చెన్నరాష్ట్రములోని ప్రజలు.

మనరాష్ట్రము చెన్నరాష్ట్రము. చెన్నపట్టనమునకు మదరాసు అనికూడ పేరు. కనుక చెన్నరాష్ట్రమును మదరాసురాష్ట్రమని యందురు. చెన్నపట్టణమే మనరాష్ట్రములోని ముఖ్యపట్టణము.



ఈరాష్ట్రములోని ప్రజ లందఱకు భాష ఒక్కటికాదు.
ఓఢ్రభాష కొందఱు మాటలాడుదురు, వారు ఓఢ్రులు.
కొందఱు తెలుఁగు మాటలాడుదురు, వారు ఆంధ్రులు.
అఱవము కొందఱు మాటలాడుదురు. వారు అఱవలు-అఱవలనే ద్రావిడు లందురు.

కొందఱు కన్నడము మాటలాడుదురు, వారు కర్ణాటులు.
మఱికొందఱు మలయాళము మాటాడుదురు, వారు మలయాళులు.

వీరుగాక దాదాపుగాఅన్ని చోట్లను, ముఖ్యముగా, హైదరాబాదుచుట్టుపట్లను, హిందూస్థాని మాటలాడువారు కలరు. వారు మహమ్మదీయులు. సామాన్యముగావారిని తురకలందురు.

లిపిలేని అడవిభాషలు మాటాడు చెంచులు,కోయలు, శబరులు మొదలగువారు అరణ్యప్రాంతములందు కలరు.

పెద్దపెద్దయుద్యోగములుచేయువారిలోఅనేకులుఇంగ్లీషుభాష మాటాడువారు. వారినేఆంగ్లేయులనియుదొరలనియు అందురు.

ఇంగ్లీషుభాష రాజభాషగనుక, చదువుకొన్న వారిలో అనేకులు ఇంగ్లీషుకూడమాటాడఁగలరు, వ్రాయఁగలరు, చదువఁగలరు.

ప్రశ్నలు.—1. మనరాష్ట్రములో నేయేభాషలు వాడఁబడుచున్నవి? 2. అన్నిచోట్లఁ జదువుకొన్నవారిచే నుపయోగింపఁబడు భాషయేది? 3. అది యొక్కటే యట్లుపయోగింపఁబడుటకుఁ గారణమేమి?

మాటలు—రాష్ట్రము, ఉద్యోగము, రాజభాష, ఖబరులు.



## 25. తండ్రి, కూఁతులు.

ఒకనికి ఇద్దఱు కూఁతులుండిరి. ఇద్దఱకుకూడ అతఁడు పెండ్లిండ్లు చేసెను. పెద్దకూఁతును ఒక్కతోఁటవానికిచ్చెను. ఇటికెలు చేయువాని కొకనికి రెండవకూఁతు నిచ్చెను. తగిన వయస్సు రాఁగానే వారలను అత్తవారిండ్లకు పంపించెను.

కొంతకాలమైనపిమ్మట పెద్దకూఁతును జూడఁగోరి యామె యింటికి పోయెను. "అమ్మా! నీకాఁపుర మెటులున్నది? నీవు సుఖముగా నున్నావా?" అని తండ్రి కూఁతునడిగెను. "నేను సుఖముగానేయున్నాను నాకేమియులోపము లేదు. కాని, నెల దినములనుండి యెండతీవ్రముగా కాయుచున్నది. మాతోఁట

లోని నూతిలో నీరు ఎండిపోయినది. క్రొత్తగా వేసిన మొక్కలు ఎట్లు బ్రదుకునో యేమియు తోఁచకున్నది. ఆకాశముమీఁద ఒక చిన్న మేఘమైనఁ గనఁబడకున్నది. ఈ వరుస చూడఁగా ఇంతటివర్షము కురియునని తోఁచదు. ఎంతో సొమ్ము వెచ్చించి క్రొత్తమొక్కలు తెప్పించి నాటితిమి, అంతయు దండుగయగును గాఁబోలు! ఒకటి రెండు దినములలో దేవుని దయవలన ఒక పెద్దవర్షము కురిసినయెడల మాత్రము మాకేవిధమైన లోపముండదు" అని కూఁతురు చెప్పెను.

ఆమె యింటియొద్ద రెండుదినములుండి తండ్రి రెండవకూఁతునింటికిఁ బోయెను. "అమ్మా! నీ కాఁపురమెటులున్నది? నీవు సుఖముగానున్నావా?" యని యాతఁడు కూఁతునడిగెను. "నేను సుఖముగా నేయున్నాను; నాకేమియులోపము లేదు. కాని, పట్టిన అంత యిటికయు వెంకునుగూడ కళ్లములలోనున్నవి. రాజు గారిమేడకై యింతవిరివిగాఁ బట్టితిమి. ఆవ మింకను పేర్ప లేదు. బట్టతడుపు చినుకులు పడినను మాకొంప మునిఁగిపోవును. అఱచేతులలో ప్రాణములు పెట్టుకొని యున్నాము. ఈ వఱపు ఇంక ఒక్క మాసము వఱకుండినయెడల మేముపట్టుటకు ఒప్పుదలచేసికొన్న యిటిక యంతయు పూర్తినొందును. కనుక, పాటు కున ఒక్క చినుకైన పడకుండ దేవుని దయవలన ఈరీతిగనే యుండునెడల మాకేమియు లోపముండ" దని కూఁతురు చెప్పెను.

అప్పుడు తండ్రి యామెతో నిట్లనియెను.

"అమ్మా! మీయక్క వర్షము కావలయునని ఆత్రపడుచున్నది; వాన రాఁగూడదని నీవు కోరుచుంటివి. మీకోరికలలో ఎవరికోరిక సఫలము చేయవలసినదని భగవంతుని ప్రార్థింపవలయునో నాకు తోఁచకున్నది."

ప్రశ్నలు.—1. పెద్దకూఁతును దండ్రి యేమిపనిచ్చెను? 2. రెండవదాని కేమిపనిచ్చెను? 3. పెద్దకూఁతురు తండ్రితో నేమి చెప్పెను? 4. చిన్నదేమి చెప్పెను? 5. తండ్రి యేమి పలికెను?

మాటలు.—వయస్సు, పిమ్మట, కాఁపురము, లోపము, తీవ్రముగా, మేఘము, దండుగ, కళ్లము, వఱపు, మాసము, ఆత్రపడు, సఫలము.

---



## 26. సర్. తి. ముత్తుస్వామి అయ్యరుగారు.

మదరాసు రాష్ట్రములో దక్షిణమున ఉన్న తంజావూరు జిల్లాలో "ఉచ్చివాడి" అను పేరుగల గ్రామమున్నది. ఆగ్రామమున 1832వ-సంవత్సరము జాన్యుఅరి 28 తేదిని ముత్తుస్వామి అయ్యరుగారు జన్మించిరి. వీరితల్లిదండ్రులు మిక్కిలి పేదవారు. వీరిచిన్నవయస్సునందే తండ్రిగారుమరణించిరి. అంతటతల్లిగారీ చిన్నవానిని తీసికొని తిరువారూరను గ్రామమునకు పోయిరి. అచ్చట వీరికి కొలఁదిగా అఱవభాషలో చదువు చెప్పించిరి.

వీరికి ఇంగ్లీషు విద్య నేర్పుటకుఁ దల్లిగారియొద్ద తగిన ధనము లేదు. ఏదైననొక ఉద్యోగములో ప్రవేశించినఁ గాని కుటుంబము జరుగు దారి లేకపోవుటచే, ఒక కరణము క్రింద వీరు గుమాస్తాగా ప్రవేశించిరి. అప్పుడు వీరికి జీతము నెల కొకరూపాయి.

విద్యయందు వీరికి ఆసక్తిమెండు. వీరిబుద్ధిని యోగ్యతను చూచి కొందఱు అభిమానించుకొని యింగ్లీషుచదువు చెప్పించిరి. పరీక్షలలో ఎన్నియో బహుమతు లీయన సంపాదించిరి. ఒకసారి యింగ్లిషుభాషలో నొక మంచివ్యాసము వ్రాసి వీర యిరువందలరూపాయల బహుమానమును తీసికొనిరి. గణిత శాస్త్రమందు వీరిబుద్ధి మిక్కిలి ప్రకాశించెను. చదువుపూర్తి కాఁగానే అఱువదిరూపాయల జీతముతో వీరు ఉపాధ్యాయులుగా ప్రవేశించిరి.

తరువాత కొన్ని సర్కారు ఉద్యోగములను జేసి తుదకు హైకోర్టు జడ్జిపనిలో ప్రవేశించిరి. ఈపనికివచ్చినమనవారిలో వీరే మొదటివారు. ఈ పనిలో వీరు బాగుగా ఆలోచించి న్యాయ్యములైనతీర్పులిచ్చిరని కీర్తిపొందినారు. వీరితరువాత ఈ పనికి వచ్చిన మనవారిలో వీరికంటె ఎక్కువ వారుకాని, వీరితో సమానులు గాని, లేరని జనులుచెప్పుకొనుచున్నారు.

వీరి రాజభక్తికై మెచ్చి దొరతనమువారు వీరికి గొప్ప బిరుదు లిచ్చిరి. అఱువది మూఁడేండ్లు జీవించి 1895-వ సంవత్సరమున వీరు స్వర్గస్థులైరి. చలువఱాతితో చేసినవీరివిగ్రహమొకటి హైకోర్టులో స్థాపింపఁబడెను. న్యాయసభకే కాక మదరాసు రాష్ట్రమునకుకూడ అది యొక్క అలంకారమని చెప్పవచ్చును.

ప్రశ్నలు.—1. ముత్తుస్వామి అయ్యరుగారెక్కడఁ బుట్టిరి? 2. ఏసంవత్సరమునఁ బుట్టిరి? 3. వీరి పేరుముందు 'తిరువారూరని' యుండుట కేమి కారణము? 4. వీరు మొట్టమొదట నేయుద్యోగము చేసిరి? 5. ఏశాస్త్రమున వీరు మిక్కిలి సమర్థులు? 6. జడ్జిపనిలో వీరెట్టి కీర్తిని బొందిరి? 7. ఏ సంవత్సరమున మరణించిరి?

మాటలు.—జన్మించిరి, ఉద్యోగము, ఆసక్తి, అభిమానించుకొను, బహుమతులు, వ్యాసము, దొరతనమువారు, స్వర్గస్థులు, చేలువత్తాయి, విగ్రహము, స్థాపింపఁబడెను, న్యాయసభ, అలంకారము.



# 27. ఆరోగ్యసాధనములు.

సుబ్రహ్మణ్యము.—గోపాలా! చూడు. సుందరుఁడెట్లున్నాఁడో! మనకర్మ మిట్లేమి? వాని యదృష్ట మట్లేమి?

గో.—ఏమి! తెలివి తేటలలోనా?

సు.—తెలివితేటలలో నేకాదు. అన్నిటిలోను. ఆరోగ్యమున్న మొదల ఇఁక నేమిలోటు? తెలివితేటలు, సిరి, సమస్తమును ఆరోగ్యమువల్లనే వృద్ధిపొందును. ఎప్పుడును రోగ

ములతో బాధపడువానికి సుఖ మెక్కడిది? సుఖము లేనప్పుడు తెలివియు, సిరియు ఎట్లు రాణించును?

గో.—నీవు చెప్పినది నిజమే. మన సుందరుని చూడుము. వాఁడు పేరికి తగిన ట్లున్నాఁడు. నిజముగా సుందరుఁడే. వానిశరీర మెంతో ఆరోగ్యవంతముగా నున్నది.

సు.—అవును. వాని తల్లిదండ్రులు దృఢశరీరులు. చేదువు కొన్నవారు. సుందరుని చిన్నప్పటినుండియు జాగ్రత్తతో పెంచినారు. వారు ధనవంతులు. వారియింట మంచినీరు కాఁచేక త్రాగరు. నీటిని తెచ్చి, కాఁచి, వడఁబోసి, త్రాగుదురు. చెడ్డనీరు త్రాగినయెడల, అందులోని కలుషములు లోపలికిపోయి జబ్బుచేయును.

గో.—వారి యిల్లెంతో యెత్తుగాకట్టించినారు. ఇంటికిచుట్టును ఎంతో ఖాళీస్థల మున్నది. కనుక మంచిగాలి కావలసినంత. ఎన్నో కిటికీలుండుటవలన, మంచిగాలి అన్ని గదులలోనికి పోయి చెడుగాలినికొట్టివేయును. వా రెప్పుడును మంచి గాలినే పీల్చుచుందురు.

సు.—అవును. మాయిల్లు గోతిలో నున్నట్లున్నది. మాయింటి లోని చెడుగాలి పైకిపోదు. ఆవలి మంచిగాలి లోనికి రాదు. అందువల్లనే మా యింటిలో ఎవరో యొకరు రోగముచేత బాధపడుచునే యుందురు.

గో.—సుందరునితల్లి వానికి వేళకు అన్నము పెట్టును. ఎక్కువ తినినయెడల శరీరము బలియు నను దుర్భ్రమతో ఎప్పుడును ఎక్కువ పెట్టదు. జీర్ణముకాని వస్తువులు తిననీయదు. చెడ్డ కాయగూరలను వారియింటికి తేనీయదు. వారింట మద్యపానము చేయువా రెవ్వరును లేరు. వారింటిలో

ఎవ్వరును నల్లమందు వేయరు, చుట్టలు త్రాగరు.

**సు.**—అన్నియును సరేకాని, మీరొకటిమఱచినారు. మాయమ్మగారు నన్నెప్పుడును మురికిబట్టలను కట్టుకొననీయరు. అనుదినమును శుభ్రముగా స్నానము చేయనియెడల కోపపడుదురు. ఉదయమునను, సాయంకాలమునను, శరీరము చెమ్మట పట్టువఱకును ఆట లాడింతురు. రాత్రి విస్తారము మేలుకొన నీయరు. తెల్లవాఱినతరువాత పడుకొననీయరు.

**ప్రశ్నలు.**—సుందరుఁ డారోగ్యవంతుఁడై యుండుటకుఁ గారణ మేమి? 2. గోపాలుఁడును, సుబ్రహ్మణ్యమును, అట్లుండక పోవుటకు హేతు వేమి? 3. "వాఁడు పేరికిఁదగిన ట్లున్నాఁడు" అన నర్థమేమి? అట్లుండుట ఎట్లు తటస్థించెను?

**మాటలు.**—ఆరోగ్యము, దృఢశరీరులు, ధనవంతులు, కలుషము, దుర్భ్రమ, మద్యపానము, అనుదినము.



## 28. పరీక్షితుఁడు, శాపము.

భారతయుద్ధము తరువాత ధర్మరాజే దేశమును పరిపాలించెను. ధర్మరాజు తరువాత అర్జునునిమనుమఁడైన పరీక్షితుఁడు


సింహాసన మెక్కెను. ఇతని తండ్రి అభిమన్యుఁడు, భారత యుద్ధములో మృతినొందెను.

పరీక్షితుఁ డొకనాఁడు వేఁటకై యడవికి పోయెను. ఒక మృగమును పట్టుకొనవలయు నను పట్టుదలతో దానిని తఱుముచు పరిజనులను విడిచి లోయడవి కొక్కఁడును పోయెను. పరుగెత్తుట వలన ఆతఁడు మిగుల బడలియుండెను. ఆతనికి మిగుల దాహముగూడ నయ్యెను. మంచినీటికొఱకాతఁ డిట నట వెదకుచుండఁగా,నొక చెట్టుక్రింద జపము చేసికొనుచున్న ముని నొకనిఁ జూచెను.ఆతని పేరు శమీకుఁడు. ఆతనియొద్ద నొకకమండలువు ఉన్నది. దానిలో నీరుండునుగావున, 'నాలుక యెండిపోవుచున్నది. స్వామీ ! రవంత మంచినీరి' మ్మని యా మునిని ప్రార్థించెను.

ఆతఁడు గాఢముగు జపములోనుండుటచేత,ఈరాజు మాట ఆయనకు వినఁబడలేదు. బ్రాహ్మణుఁడు దొంగ జపమునఁ గూర్చుండి తన్ను లక్ష్యపెట్టలేదని రా జూహించి, కోపించి, యొక చచ్చినపామును ఆతని మెడకుఁ జుట్టఁబెట్టి తనవారిని గలిసికొనుటకు వెనుకకుఁ బోయెను.

సమీపముననున్న మునిబాలకు లీవార్తను శమీకుని కొడుకగు శృంగితోఁ జెప్పిరి. రాజిట్లు తనతండ్రిని అవమానించినాఁడను కోపముతో ఆబాలుఁడు మండిపడెను. కౌశికియను నదికిఁ బోయి జలములను స్పృశించి "నాతండ్రి మెడను చచ్చిన పామును చుట్టఁబెట్టిన యారా జీ రోజునకుఏడవనాఁడు పాము కాటుచేఁ జచ్చుఁగాక !" యని యతఁడు శపించెను.

ఇట్లు శపించి యాతఁడు తండ్రియొద్దకు వచ్చెను. తండ్రి యింకను జపమునుండి లేవనేలేదు. పామింకను ఆతని మెడచేం



శ్రీ జార్జిచక్రవర్తి, శ్రీమేరీగారు.

# 29. శ్రీ జార్జి చక్రవర్తిగారిచరిత్ర.

శ్రీజార్జిగారు 1865 వ-సంవత్సరము జూన్ నెల మూఁడవ తారీఖున లండను పట్టనములో జన్మించినారు.

లేఁతవయసున-అనఁగా పదునాలుగవ యేఁట - మూఁడు సంవత్సరములు ఓడప్రయాణముచేసి బహు దేశములు చూచి నారు. కనుక చిన్ననాఁడే ప్రపంచజ్ఞానము ఎక్కువగా సంపాదించినారు.

ఇరువదియేండ్లు నావిక సేనలో పెద్ద యుద్యోగిగా నుండి కట్టు దిట్టముగ పనిచేసినారు. అయినను క్రింది యుద్యోగస్థులను చాల దయతోఁ జూచినారు. నావికులకు ఉండవలసిన ఉత్తమగుణములు - సత్యము, విధేయత, పట్టుదలయును అని బోధించినారు.

1893 వ-సంవత్సరమున శ్రీమేరీగారిని వివాహము చేసికొన్నారు. వారిని జూచి సంతోషించుటకు అప్పుడు శ్రీవిక్టోరియారాణిగారు జీవించియున్నారు. భార్యయెడలను బిడ్డలయెడలను మిక్కిలి అనురాగము గలవారై కుటుంబధర్మములను చక్కఁగా నెఱపెడు వారు.

కృషిశాస్త్రమునందు మంచి అనుభవము గలవారు. తుపాకి వేఁతలో మిక్కిలి ప్రజ్ఞగలవారు.

కొన్ని యాటయలందును నాటకములుచూచుటయందును వీరి కెక్కువ సరదా. కాని, పేకాట యిష్టముగాదు.

అనేక గ్రంథములు చేదివినవారు. చరిత్ర పుస్తకములపై అభిమాన మెక్కువ.

1901 - వ సంవత్సరములో మేరీరాణిగారితోఁ గూడ

ఆస్ట్రేలియాకు వెళ్లిరి. అక్కడ బడి పిల్లలకు బహుమతు లిచ్చిరి. "మీకు విధించిన పనులను శక్తివంచన లేకుండ చేయుడు. మాతా పితృభక్తి, రాజభక్తి, దైవభక్తి గలిగియుండుడు" అని వారికి బోధించినారు.

ఇంగ్లండు రాజుగారి పెద్దకొమారునకు "ప్రిన్సఫ్ వేల్సు" అను బిరు దిత్తురు. ఆబిరుదుపుచ్చుకొని, 1905-6వ-సంవత్సరములలో జార్జి గారు మేరీగారితో మన దేశమును జూచుటకు వచ్చిరి. ఇండియా బర్మాలలో 9000 మైళ్లకెక్కువ ప్రదేశమును జూచిరి. మన దేశములో అనేక రాజులకు దర్శనమిచ్చిరి. చెన్నపట్టనమునకుఁగూడ వచ్చిరి. అప్పుడే దానిలో 'బ్లాక్టౌను' అనుదానికి 'జార్జిటౌను' అను పేరు పెట్టఁబడెను.

తండ్రిగారైన 'ఎడ్వర్డు' ప్రభువువారు స్వర్గస్థులగుటచేత 1911 వ- సంవత్సరము జూను 22 వ తేదీని ఇంగ్లండులో పట్టాభిషిక్తులైనారు. ఆపట్టాభిషేక మహోత్సవములు మన దేశములో ప్రతి పట్టనమునను జేరిగినవి. దేవాలయములు, మసీదులు మొదలగు ప్రార్థనమందిరములలో ప్రార్థనలుజేరిపినారు. ఆశీర్వాద సభలు చేసినారు. బీదలకు తృప్తిగా భోజనము పెట్టినారు. బడిపిల్లలకు మిఠాయి పంచిపెట్టినారు. సంగీతములు పాడించినారు.

వారిపూర్వులు చూపనిదయ శ్రీజార్జిచక్రవర్తిగారును శ్రీమేరీచక్రవర్తినిగారును మన కొక విషయమున చూపినారు. 1911 వ-సంవత్సరము డిసెంబరు 12వ- తేదీని తాము విచ్చేసి ఢిల్లీ పట్టనములో మహావైభవముతో పట్టాభిషేకము చేసికొన్నారు. అదే మనపూర్వచక్రవర్తులు పట్టాభిషిక్తులైన చోటు. వారి ప్రజానురాగమునకై ఆసేతు హిమాచల

పర్యంతము ప్రజలు కొండంత సంతోషము పొందినారు.

ప్రశ్నలు.——1. శ్రీజార్జిగారి యిప్పటి వయస్సెంత? 2. నావికులకు వారుచేసిన యుపదేశమేమి? 3. బడిపిల్లల కొకసారి యేమి బోధించిరి? 4. వారి కేవేవి యిష్టములు? 5. వారెప్పు డింగ్లండులోఁ బట్టాభిషిక్తులైరి? 6. వారు వారిపూర్వులు చూపని యనుగ్రహము మనకేమి చూపిరి?

మాటలు.—— నావికసేన, కుటుంబధర్మములు, కృషిశాస్త్రము, అనుభవము, కుశలుఁడు, అభిమానము, శక్తివంచన, స్వర్గస్థులు, ప్రజానురాగము, ఆసేతుహిమాచలపర్యంతము.

---

## రెండవ భాగము.

# 1. సూర్యోదయము.

### మంజరి.

కొక్కొరోకోయంచుఁ | గోడి కూసినది.
వెండినాణెమువలె | వేగుఁజుక్కదిగో!
కోలకోలమంచుఁ బ | క్షులు చాలఁ గూసెఁ,
గలకల మని తెల్వి | గాంచెను దిశలు. 4
తూరుపు దిక్కుపైఁ | దొగరు రం గదిగో!
రంగారుసాలువో | రత్నకంబళమొ
జేగురుగోడయో | చెంగల్వకోలనో
యన్నట్టు లరుణోద | యం బయ్యె నదిగో! 8
ఆ నడుమను జూడు | మదియేమి వింత!
కుంకుమరాశియో | గుమ్మడిపండో

పట్టు పొత్తులలోని ఽ ప్రభుని బాలకుఁడో
యన సూర్యుఁడు వెలింగె ఽ నాకాశమందు.

ఆలస్య మింకఁ జేయఁగరాదు మనము.
చప్పునఁ బల్దోమి ఽ స్నానంబు చేసి
శుభ్రమౌ లాఁగును ఽ జొక్కాను దొడిగి
శ్రద్ధతోఁ బాఠముల్ ఽ చదువఁగా వలయు.

---

## 2. తల్లి.

మంజరి.

నను గర్భమునఁ దాల్చి, ఽ నాఁటి నుండియును
గణన చేయఁగలేని ఽ గండాలఁ గడచి.
నవమాసములు మోసి ఽ నన్నుఁ గన్నట్టి
తల్లి కంటెను వేఱు ఽ దైవంబు గలదె ?

గ్రహణము ల్పట్టిన ఽ కాలంబులందు
ముం దెప్పుడో పుట్టు ఽ పుత్త్రుని మేన,
మొట్టియో తొట్టియో ఽ పొడచూపునెడు
భయమున, *రోగిని ఽ పగిది మంచమునఁ
బడియుండి భగవంతుఁ ఽ బ్రార్థించినట్టి
తల్లికంటెను వేఱు ఽ దైవంబు గలదె ?

యమబాధ పెట్టి నేనవని పైఁబడఁగ.
ననుఁ జూచి కష్టమంతయుఁ గూడ మఱచి

---

* రోగిని = రోగము వచ్చిన స్త్రీ.

ప్రక్కనుంచిన నాకుఁ § బాలిచ్చినట్టి
తల్లికంటెను వేఱు § దైవంబు గలదె? 14

తన పనుల్మాని, నిద్రను దిండి మాని,
నా యేడ్పు వినినంత § "నాతండ్రి !" యంచు,
[1]నుడివడి వచ్చి న § న్జోకొట్టినట్టి
తల్లికంటెను వేఱు § దైవంబు గలదె ? 18

నా కాళ్లు నా కొట్లు § నా తిట్లు గనక
మంచి యాహారముల్ § మంచిబట్టలును,
నెంచి నాకుంచి తా § [2]నిక్కట్లు పడెడు
తల్లికంటెను వేఱు § దైవంబు గలదె ? 22

నా యీడు దాఁచి [3]దుండగములు దాఁచి,
యెవరేని [4]యగ్గింప § నెదను బొంగియును,
దెచ్చి నాకెన్నియో § దిగఁదుడ్చిపోయు
తల్లికంటెను వేఱు § దైవంబు గలదె ? 26

ప్రొద్దున ననుదిద్ది, § బువ్వను బెట్టి,
పుస్తకాలిచ్చి, మో § మున 'రక్ష' యుంచి,
ముద్దిడి, బడికంపి, § పూర్ణమౌ ప్రేమ
నెపుడు నేవత్తునో § యింటికి మఱల
నంచు నాబడివైపె § యరయుచు నుండు
తల్లికంటెను వేఱు § దైవంబు గలదె ? 32

---

1. నుడివడి = కలఁతపడి. 2. ఇక్కట్లు = చిక్కులు - ఇబ్బందులు. 3. దుండగములు=దుశ్చేష్టలు - కొంటెపనులు. 4. అగ్గింపఁగ = పొగడఁగా-స్తుతింపఁగా.

దారి నేఁ బడఁగాంచి తా దవ్వునుండి
తొరపడి వచ్చి చేతుల లేవనెత్తి.
"నేలపైఁబడ్డది నీవు కాదమ్మ!"
యంచుఁగొంగున దుమ్మునంతయు దులిపి.

'తూ' యని నాచేతఁ * దూపాడిపించి
ప్రేమతో మెల్లగా వీఁపుపైఁ జేఱచి
వెంటనే నన్నంకఁ బెట్టుక చేన్న
తల్లికంటెను వేఱు దైవంబు గలదె?

---

## 3. ఉక్క, వర్షము.

ఉక్కచేఁ గాలఁ బెట్టె 'నుస్సురు' లుప్పెట్టె;
మితిలేని చెమ్మట మేనెల్లఁ దడిపె;
విసన కఱ్ఱలు చేయి వీడక యాడె;
పెద్దదాహము కల్గి పెదవుల నార్చె.


అంతలో నాకాశ మంతయుఁ గ్రమ్మెఁ
గాటుక కార్మబ్బు కంటికింపుగను;
గాలివచ్చెను హాయి గా మబ్బునుండి.

కన్నుల మిఱుమిట్లు కలుగు లాగునను
మింటఁ దళుక్కని మెఱుములు మెఱసె
పటపటఁ బైనేదొ పగిలినరీతి
నుఱుములు చెవులలో నుఱిమె నెన్నెన్నొ.

---

* తూపాడిపించి – ఉమ్మివేయించి.

కుమ్మరించిన యట్లు కురిసెను వాన;
పుడమినందలి ప్రాణములు చల్లఁబడియె.
మొదటఁ గొంచెము కష్టములను బడకుండ
సుఖపడువారిని జూడ మెవ్వరిని.



## 4. కట్టుకథ.

చెల్లెలా! రారమ్మ చెల్లెలా రమ్మ!
ఏది చూచెద విప్పు మీ కట్టుకథను

కదలఁగాఁ గలిగిన కాళ్లు రెండుండుఁ
గాని నే నరుఁడను గాను గానమ్మ.

ఈవైపు నావైపు నిరుఁ గొమ్ములుండు
గాని నే గోవును గాను గానమ్మ.

భూమిపై నలికాళ్లు మోపకే పోదుఁ

గాని పతకాని నేను ఽ గాను గానమ్మ.
వెలగల జీను నా ఽ వీఁపుపై నుండుఁ
గాని గుఱ్ఱము నేను ఽ గాను గానమ్మ.
గణగణ మ్రోఁగెడు ఽ గంట నాకుండుఁ
గాని బండెద్దును ఽ గానుగానమ్మ.
తళతళల్ గల గొల్సు ఽ తగిలించుకొందుఁ
గాని 'వాచిని' నేను ఽ గాను గానమ్మ.
వింత సున్నలు రెండు ఽ వెలసిన ట్లుందుఁ
గాని విసర్గంబు ఽ గాను గానమ్మ.
నిలువఁబెట్టిననైన ఽ నిలుచుండ లేను
గాని నేఁ బరుగెత్తఁ ఽ గలను గలనమ్మ.
చిటికలో నది యేదో ఽ చెప్పుకొంటేని
యది నీకుఁ జెప్పుదు ఽ నయిదుపూఁటలను.

---

## 5. దొంగ-అతని తల్లి.

గీ. బాలుఁ డొక్కఁడు తనపాఠ ఽ శాలయందుఁ
దోడిబాలుని పొత్తంబు ఽ దొంగిలించి
తల్లికిని జూప, నీడిచి ఽ తన్న కుండఁ
జిఱునగవు నవ్వుచు నుపేక్ష ఽ చేసె నకట ! 1

గీ. అతఁడు మఱియొక్కనాఁడు మే ఽ లైనయట్టి
సరిగదుస్తుల నెచేటివో ఽ సంగ్రహించి

---

1 సరిగ = జరి; జిలతారు.

యమ్మకనుఁజూప, నామె "యాహా"! యటంచుఁ
గొడుకు తెలివికి సంతోష పడియె నకట ! 2

గీ. ఎవ్వరికిఁ గానఁబడకుండ నేదొ యొకటి
యిల్లు తెచ్చుచుఁ దల్లికి నీయసాగె;
నంత నానాఁటఁ బెద్దవాఁ డయ్యెనతఁడు,
వయసుతో దొంగబుద్ధియుఁ బ్రబలుచుండె. 3

గీ. బాల్యమందున బడిదొంగ, వయసురాఁగ
బందిపోటు దొంగలలోనఁ బ్రబలుఁ డయ్యెఁ,
[1]దస్కరత యెంతకాలము దాఁగఁగలదు ?
పాపము ఫలించె; నాతఁడు పట్టువడియె. 4

గీ. అతని నేరము స్థిరపడె నతని కపుడు
మరణదండన విధియించె మనుజవిభుఁడు;
కొడుక ! కొడుకా ! యనుచుఁ దల్లి గొల్లుమనుచు
బిడ్డ నురిదీయుచోటికి వేగ నేగె. 5

గీ. అతఁడు తల్లినిజూచి 'మాయమ్మ ! నీకుఁ
జిన్నయొకమాట చెవిలోనఁ జెప్పవలయు
ర' మ్మనఁగ నామెవచ్చి కర్ణం బొసంగ
నామెచెవిని గటుక్కున నతఁడు కొఱికె. 6

గీ. చెవిని గొఱికితివేమిరా [2]చెనఁటి ! యనుచుఁ,
జింతలోఁ గొంతకోపంబు చెంది, యామె
యతనిఁ జీకొట్టి యదలించి యాగ్రహింపఁ
గనుల నీరొల్క నతఁ డిట్టు లనియెఁ దిరుగ. 7

1 తస్కరత=దొంగతనము. 2 చెనఁటి = దుష్టుఁడా !

గీ. ఏను బడిపుస్తకము దొంగిలించినపుడె
యిట్లు చీకొట్టి నన్ను శిక్షించితేని,
యిట్టి దుర్గతి నాకు, నీ కిట్టిచింత,
కలుగకుండును గాదె యో కన్నతల్లి ! 8

గీ. బాలుఁడే కాదె దోష మల్పంబు కాదె !
యనుచుఁ దలిదండ్రు లెంచేఁగాఁ జేనదు ! చేనదు !
పాలదంతాలతఱి దిద్దఁబడనిగుణము
కోరమీసాల నాఁడెట్లు కుదురఁగలదు ? 9

---

# నీతిపద్యములు.

క. అక్కఱకురాని చుట్టము,
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము,
గ్రక్కున విడువంగవలయుఁ గదరా సుమతీ. 1

క. కూరిమి గల దినములలో,
నేరము లెన్నఁడును దోఁచ నేరవు మఱి యా,
కూరిమి విరసంబైనను,
నేరములే తోఁచుచుండు నిక్కము సుమతీ. 2

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు,
నెప్పుడు నెడ తెగక పాఱు నేఱును ద్విజుఁడున్,
జొప్పడిన యూరనుండుము,
చొప్పడ కున్నట్టియూరు సొరకుము సుమతీ. 3

క. ఉపకారికి నుపకారము,
విపరీతము గాదు సేయ వివరింపంగా,
నపకారికి నుపకారము,
నెపమెన్నక సేయువాఁడు నేర్పరి సుమతీ. 4

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత,
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్,
నొప్పింపక తా నొవ్వక,
తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు సుమతీ. 5

క. ఎప్పుడు సంపద గలిగిన,
నప్పుడె బంధువులువత్తు రది యెట్లన్నన్,
దెప్పలుగఁ జెఱువునిండినఁ,
గప్పలు పదివేలుచేరుఁ గదరాసుమతీ. 6

క. ఏఱకుమీ కసుఁగాయలు,
దూఱకుమీ బంధుజనులఁ దోషముసుమ్మీ!
పాఱకుమీ రణమందున,
మీఱకుమీ గురులయాజ్ఞ మేదిని సుమతీ. 7

క. కనకపు సింహాసనమున,
శునకముఁ గూర్చుండఁబెట్టి శుభలగ్నమునం,
దొనరఁగఁ బట్టముగట్టిన,
వెనుకటి గుణ మేలమాను వినురాసుమతీ. 8

క. కులకాంత తోడనెప్పుడు,
కలహింపకు; వట్టితప్పు ఘటియింపకుమీ

కలకంఠకంఠి కన్నీ
రొలికిన సిరి యింటనుండ నొల్లదు సుమతీ. 9

క. చేతులకుఁ దొడవు దానము;
భూతలనాథులకుఁ దొడవు బొంకమి; ధరలో,
నీతియె తొడవెవ్వారికి;
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ. 10

---

రావుబహద్దరు కం. వీరేశలింగముపంతులుగారి నీతిదీపిక నుండి తీసినపద్యములు.

## మంచి బాలుఁడు.

గీ. భోజనము చేయునప్పుడు బుద్ధిగలిగి,
లేనివస్తువు తెమ్మని లేనిపోని,
యాగడము చేసి యలఁచేక వేగమునను,
గలకొలందిని భుజియించి కదలిపోవు. 1

గీ. తానుబడియందుఁ జదివిన దానినెపుడు,
మఱచిపోవక వల్లించు మరల మరలఁ,
బుస్తకంబులఁ జింపక పొదుపుగాను,
వాడుకొనుచుండుఁ దనతోడి వారుమెచ్చ. 2

## విద్య.

గీ. రాజు తనదేశముననె గౌరవముగాంచుఁ;
బండితుఁడో, యెల్లయెడ, గౌరవమ్ము వడయుఁ

జేదువునకు రాజ్యమైనను జాలదనఁగ
విద్యతో సాటి మఱియేది విశ్వమునను? 3

**అడఁకువ.**

ఆ. ఎంతకలిమి గలుగు నంత యడఁకువఁ,
గలిగియుండవలయు, గర్వపడక,
యన్నిగుణములుండి యడఁకువ లేకున్న,
నిష్ఫలంబు లవ్వి నిశ్చయముగ. 4

గీ. చేదువునకుఁదోడు వినయంబు గుదిరియుంట,
పసిఁడికిని దావియబ్బిన భాతియగును;
విద్యగలిగియు నడఁకువ వెలయకుంట,
యమరతరువును గచ్చ చెట్టలమికొనుట. 5

---

## మూఁడవ భాగము.

# వ్యాకరణము.

ఈక్రింది వ్యాకరణ విషయములను బాలురచేత వల్లింపింపఁగూడదు. ఆయారూపములు వాచకపుస్తకములో వచ్చినప్పుడు వానిఁ గనఁబఱిచి, ప్రశ్నలువేసి లింగ వచన కాలాది

భేదములు బాలురకు స్పష్టముగాఁ దెలియునట్లు చేయవలెను. వ్యాకరణ పరిభాషాపదములను మొదటనే చెప్పఁగూడదు.

I. నామములు:—పురుషులను గాని, స్త్రీలను గాని, యితర జంతువులను గాని, ప్రాణములేనివస్తువులనుగాని చెప్పును. ఉ॥ రాముఁడు, తండ్రి – ఇవి పుంలింగములు (మహదర్థకములు.) సీత, కూఁతురు–ఇవి స్త్రీలింగములు (మహత్యర్థకములు.) ఎద్దు, ఆవు, చెట్టు, పలక – ఇవి నపుంసకములు (అమహదర్థకములు.)

II. కృష్ణుఁడు, హరి, తాత, అక్క, తల్లి, కూఁతురు, పుట్ట, పిల్లి, చెట్టు, నేను, నీవు, వాఁడు, అది – వీని యేకవచన బహువచనము లన్ని విభక్తులలోను జెప్పింపవలెను.

కర్త ప్రథమా విభక్తిలో నుండును. కర్మపదము ద్వితీయావిభక్తిలో నుండును. ఇవి బాలురు కనుగొను నట్లు చేయవలెను.

III. లింగవచనభేదమువలనఁ గ్రియలకుఁగల్గు నీక్రిందిమార్పులను బాలుర కలవాటు చేయవలెను.

(a) రాజువచ్చుచున్నాఁడు—రాజులు వచ్చుచున్నారు.
బాలిక పోవుచున్నది—బాలికలు పోవుచున్నారు.
పక్షి యెగురుచున్నది—పక్షు లెగురుచున్నవి.
చెట్టు పెరుఁగుచున్నది—చెట్లు పెరుఁగుచున్నవి.
గోడ యెత్తుగానున్నది—గోడ లెత్తుగానున్నవి.

ఇవి జరుగుచున్న కాలమును దెల్పును - అనగా వర్తమానకాలమును.

(b) రాజు చూచెను—రాజులు చూచిరి.

బాలిక పాడెను—బాలికలు పాడిరి.

పక్షి కూసెను—పక్షులు కూసెను.

చెట్టు కాచెను—చెట్లు కాచెను.

గోడ పడెను—గోడలు పడెను.

ఇవి గతించిన (జరిగిపోయిన) కాలమును దెలుపును - అనఁగా భూతకాలమును.

(c) రాజు రేపు వచ్చును—రాజులు రేపు వత్తురు.

బాలిక రేపు పాడును—బాలికలు రేపు పాడుదురు.

ఆవు రేపు మేయును—ఆవులు రేపు మేయును.

చెట్టు రేపు పూచును—చెట్లు రేపు పూచును.

చెఱువు రేపు నిండును—చెఱువులు రేపు నిండును.

ఇవి రాఁబోవుకాలమును దెలుపును - అనఁగా భవిష్యత్కాలమును.

IV. (a) నేను వచ్చుచున్నాను—వచ్చితిని, వత్తును.

మేము వచ్చుచున్నాము—వచ్చితిమి, వత్తుము.

ఇవి ఉత్తమపురుషరూపములు.

(b) నీవు వచ్చుచున్నావు—వచ్చితివి, వత్తువు.
మీరు వచ్చుచున్నారు—వచ్చితిరి, వత్తురు.
ఇది మధ్యమ పురుషరూపములు.

(c) వాఁడు వచ్చుచున్నాఁడు—వచ్చెను, వచ్చును.
వారు వచ్చుచున్నారు—వచ్చిరి, వత్తురు.
అది వచ్చుచున్నది—వచ్చెను, వచ్చును.
అవి వచ్చుచున్నవి—వచ్చెను, వచ్చును.
ఇవి ప్రథమపురుష రూపములు.

---

## నాలుగవ పాఠమునకు అనుబంధము.

### తూనికమానము.

| | |
|---|---|
| 1 తులము | 1 రూపాయయెత్తు. |
| 8 తులములు | 1 పలము. |
| 5 పలములు | 1 పంపు. |
| 2 పంపులు | 1 ఏఁబలము. |

(ఏను+పలము) — మొదట దీని యర్థము 5 పలములు కాని యిప్పుడు పదిపలములుగావాడుకొనుచున్నారు.

| | |
|---|---|
| 2 ఏబలములు | 1 పదలము. |
| 3 పదలములు | 1 వీసె. |
| 5 వీసెలు | 1 సేరు. |
| 8 సేరులు | 1 వీసె. |
| 2 వీసెలు | 1 ఎత్తు. |
| 8 వీసెలు | 1 మణుఁగు. |
| 80 మణుఁగులు | 1 పుట్టి (బారువ) |

### కొలతమానము.

| | |
|---|---|
| 2 గిద్దలు | 1 అఱసోల. |
| 2 అఱసోలలు | 1 సోల. |
| 2 సోలలు | 1 తవ్వ. |
| 2 తవ్వలు | 1 మాన (మానిక) |
| 3 తవ్వలు | 1 చెన్నపట్టనపు పడి. |
| 2 మానికలు | 1 అడ్డ. |
| 2 అడ్డలు | 1 కుంచెము. |
| 4 కుంచెములు | 1 తూము. |
| 5 తూములు | 1 ఏఁదుము (ఏను తూము=ఐదు తూములు) |
| 2 ఏఁదుములు | 1 పందుము (పది తూము=పది తూములు) |
| 2 పందుములు | 1 పుట్టి. |
| 600 కుంచెములు | 1 గరిసె. |

---

Printed at Ananda Press, Madras.

| | | |
|---|---|---|
| **వచన గద్య సంగ్రహము.** పిఠాపురం మహారాజా వారికాలేజి ప్రధానోపాధ్యాయులు మ-రా-రా-శ్రీ, గో. జగన్నాథస్వామి ఎం. ఏ., ఎల్. టి., గారిచే కూర్పబడినది. వెల | Rs.A.P. 0 6 0 |
| **నీతిచంద్రిక.** పరవస్తు చిన్నయసూరి ప్రణీతము. | 0 8 0 |
| **పురాణమణిమంజరి.** మ-రా-రా-శ్రీ, గో. జగన్నాథ స్వామి ఎస్. సర్వాయుడు ఎ. సూర్యనారాయణగార్ల చే గ్రథితము. సటిప్పణము. | 0 12 0 |
| **నలోపాఖ్యానము.** టీకాతాత్పర్యముసహ. శ్రీమాన్ తం. దేవరాజ సుధీమణిగారిచే వ్యాఖ్యాతము. | 0 8 0 |
| **అంబరీషోపాఖ్యానము:—** టీకాతాత్పర్యము సహ శ్రీమాన్. తం. దేవరాజ సుధీమణిగారిచే | 0 3 0 |
| **నరసపద్యకథాసంగ్రహము.** పిఠాపురం మహారాజా వారి కాలేజి ప్రధానోపాధ్యాయులు మ-రా-రా-శ్రీ, గో, జగన్నాథస్వామి ఎం. ఏ.. ఎల్.టి., గారిచే కూర్పబడినది. సటీకము. | 0 10 |
| **విష్ణుపురాకథలు.** పర్లాకిమిడి రాజాగారి కాలేజి ఉపాధ్యాయులు పారనంది జగన్నాథస్వామిగారిచే రచింపబడినది. | 0 3 0 |
| **విక్రమార్కునికథలు.** కావ్యకంఠ గో త్రి సూర్యనారాయణ శాస్త్రిగారిచే రచింపఁబడినది. | 0 3 0 |
| **రామాయణనీతికథలు.** విజయనగరం మహారాజావారి కాలేజిఉపాధ్యాయులు చెరుకూరిజోగారావుగారిచే వ్రాయఁబడినవి. ఇందు 19 చక్కని పటములున్నవి | 0 6 |

| | Rs.A.P. |
|---|---|
| **ఈసప్‌కథలు.** నీతికథానిధి. ఇందు నలుబది కథలు చక్కని సులభశైలిని, ఆంధ్రదేశమందలి నాలు గైదు తరగతుల బాలురకు బాలికలకు ఉపయుక్త ముగా నుండునటుల వ్రాయబడినవి. | 0 4 0 |
| **షేక్స్పియర్ నాటకకథలు.** వెన్నెలకంటి సుందరరామ శర్మగారిచే రచింపఁబడినది. | 0 7 0 |
| **పసిఁడేటిరాజు.** శ్రీమతి అవసరాల శేషగిరమ్మగారిచే రచింపఁబడినది. 5,6,7, తరగతుల కుపయుక్తము. | 0 3 0 |
| **కమలిని.** శ్రీమతి వేమూరు ఆండాళమ్మగారిచే రచింపఁ బడిన నవల. | 1 0 0 |
| **బాలభారతము.** యస్. ఏ నరసింహాచార్యులు గారిచే రచింపఁబడినది. ప్రథమభాగము ఆది, సభారణ్య విరాటోద్యోగ పర్వములు 170 పేజీలు. వెల | 0 14 0 |
| ద్వితీయభాగము. భీష్మపర్వము మొదలు స్వర్గారో హణపర్వమువరకు 150 పేజీలు వెల | 0 14 0 |
| రెండు భాగములును ఒకే క్యాలికోబైండు. | 2 0 0 |
| **ధైర్యకవచము:**—(భీష్మకచరిత్రము) వి. సుందర రామశాస్త్రులచే వ్రాయఁబడినది. | 0 6 0 |
| **కల్యాణి:**—వెన్నెలకంటి సుందరరామశర్మచే, షేక్స్పి యర్ 'టెంపెస్టు' అను నాటకపు కథను గొని వ్రాయఁబడినది. | 0 2 6 |
| **శ్రీకృష్ణదేవరాయలు:**—పండిత. ద్రోణంరాజు సీతా రామ రావుగారిచే రచియింపబడెను. | 0 8 0 |